ప్రతిపక్షం

www.prathipaksham.in

మంగళవారం 09.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 259 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



నేడే భారత్, దక్షిణాఫ్రికా టీ 20 8



ప్రగతి రేసులో తెలంగాణ

'క్యూర్, ప్యూర్, రేర్' తో ముందుకు... అందరి సహకారంతో లక్ష్య సాధన

- 2047 వరకు సరికొత్త లక్ష్యాల సాధన
- దేశ జీడీపీలో రాష్ట్రం10 శాతం వాటా ఇవ్వాలి
- 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఎదగాలి
- కష్టపడి సాధిస్తామనే నమ్మకం ఉంది
- తెలంగాణ భవిష్యత్తు కోసం రోడ్ మ్యాప్
- నిపుణులు, మేధావుల సలహాలు స్వీకరిస్తాం
- అమరుల త్యాగాలతోనే ప్రత్యేక తెలంగాణ
- గ్లోబల్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఈ గ్లోబల్ సమ్మిట్‌కు అన్ని రంగాలకు చెందిన ప్రతినిధులు రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. వ్యాపారవేత్తలు, కార్పొరేట్ దిగ్గజాలు, విధాన నిర్ణేతలు, దౌత్యవేత్తలు, ప్రభుత్వ అధికారులతోపాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులకు సీఎం ధన్యవాదాలు చెప్పారు. ఈ సమ్మిట్‌లో వారి సూచనలు, సలహాలు, అభిప్రాయాలు స్వీకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తెలంగాణలో అపారమైన అవకాశాలు ఉన్నాయని వివరించారు. మంచి సానుకూల వాతావరణం కూడా ఉందన్నారు. భారతదేశంలో తెలంగాణ దాదాపు 2.9 శాతం జనాభా కలిగి ఉందని గుర్తు చేశారు.



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 8: వచ్చే పదేండ్లలో తెలంగాణను దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా, ప్రపంచంలోనే ఉన్నత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీలో సోమవారం ప్రారంభమైన 'తెలంగాణ రైజింగ్ 2047 సమ్మిట్'లో ముఖ్యమంత్రి ప్రసంగించారు. తమ రెండేండ్ల పాలనలో చేపట్టిన పథకాలు, అభివృద్ధిని ఆయన వివరించారు. తెలంగాణ లో అపారమైన అవకాశాలు ఉన్నాయని మంచి సానుకూల వాతావరణం ఉందని చెప్పుకొచ్చారు. సదస్సును గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులతో పాటు ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున, రామోజీ గ్రూప్ సీఎండీ కిరణ్,వివిధ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. 44 దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు ఈ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 2047 నాటికి భారతదేశ జీడీపీలో 10 శాతం వాటాను తెలంగాణ నుంచి అందించాలన్నది తమ లక్ష్యమని వెల్లడించారు. తెలంగాణ రైజింగ్ నిరంతర ప్రక్రియ

...:: మిగతా 2లో

'వికసిత్ భారత్' దిశగా

తెలంగాణ

- నిర్ణీత లక్ష్యాలతో ముందుకు పయనం
- 2047లో త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమే లక్ష్యం
- మహిళా సంఘాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ
- సమ్మిట్ ప్రారంభంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- గాంధీ, నెహ్రూ దారిలో రేవంత్ రెడ్డి పాలన
- రాష్ట్రం లక్ష్యాలను సాధిస్తుందనే నమ్మకం ఉంది
- ఐకమత్యం, శాంతితోనే అభివృద్ధి సాధ్యం
- ప్రపంచ సమస్యలకు భారత్ వద్ద పరిష్కారం
- నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాస్ సత్యార్థి



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 8 : వికసిత్ భారత్ దిశగా తెలంగాణ వేగంగా అడుగులు వేస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. నిర్ణీత లక్ష్యాలు నిర్దేశించుకుని తెలంగాణ ముందుకెళ్తోందని అన్నారు. 2047లోగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారాలనేది లక్ష్యమని పేర్కొన్నారు. మహిళా రైతులను పలు విధాలుగా ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. సోమవారం నాడు ఆయన భారత్ ఫ్యూచర్ సిటీలో 'తెలంగాణ రైజింగ్2047 సమ్మిట్'ను

...:: మిగతా 2లో

తెలంగాణ విజన్ డాక్యుమెంట్

మూసిన గదిలో రాసిన కాగితం కాదు.. ఇది తెలంగాణ ప్రజల పత్రం



- త్రీ ట్రిలియన్ సంఖ్య కాదు.. తెలంగాణ రూపాన్ని మార్చే శక్తి
- క్యూర్, ప్యూర్, రేర్ తెలంగాణ అభివృద్ధి కథ
- ఆతిథ్యం తోనే తెలంగాణకు గుర్తింపు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్8: తెలంగాణ విజన్ డాక్యుమెంట్ మూసివేసిన గదుల్లో రాసిన పత్రం కాదు, ప్రముఖులసలహాలు, నిపుణుల చర్చలు, పౌరుల అభిప్రాయాలతో కింది నుంచి పైకి వచ్చిన ప్రజాస్వామ్య ప్రక్రియ, అందుకే ఇది ప్రభుత్వపు పత్రం మాత్రమే కాదు, ఇది తెలంగాణ ప్రజల పత్రం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం స్పష్టంగా ఉందని, 2047 నాటికి నెట్ జీరో సాధించడమే లక్ష్యం అన్నారు. ఆర్థికాభివృద్ధి, పర్యావరణం ఒకదానికొకటి విరుద్ధం కాదు, ఇకపై ఇవి పరస్పర సహకారాలు అన్నారు. తెలంగాణ రాష్ట్రం గురించి చర్చ వచ్చినప్పుడు చాలా విషయాలు చెబుతారు, కానీ ముఖ్యంగా మేము అతిథులను ఎలా గౌరవిస్తామన్నదే మా అసలు గుర్తింపు అని అన్నారు. మేము అతిథిని చూసి చిరునవ్వు చిందించడం మాత్రమే కాదు వేడి వేడి బిర్యానీ, ఖుబానీ కా మీఠా, మరచిపోలేని రుచుల విందు పెట్టడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాం. అదే ఆత్మీయత ఈ రోజు మనందరినీ ఇక్కడికి తీసుకువచ్చింది అన్నారు. పెద్ద, ధైర్యవంతమైన, కొత్త ప్రపంచంలో భాగస్వాములు కావడానికి వచ్చిన

...:: మిగతా 2లో

'వందేమాతరం' చరిత్రకు నిదర్శనం

ఈ నినాదంతో ప్రాణత్యాగాలు చేశారు

- స్వాతంత్ర్య పోరులో ఇది బలమైన గేయం
- 150 యేండ్లు పూర్తి చేసుకోవడం గర్వకారణం
- ఎన్నో ఘట్టాలను దాటుకుంటూ ముందుకెళ్లింది
- లోక్ సభలో చర్చలో ప్రధాని నరేంద్ర మోడీ



ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, డిసెంబర్ 8: స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతరం భారతీయుల గొంతుక అయిందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. వందేమాతరం గేయం ఎన్నో తరాలకు స్ఫూర్తినిచ్చిందని ప్రశంసించారు. వందేమాతర గీతానికి 150 యేండ్లు అయిన సందర్భంగా లోక్ సభలో చర్చను ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం నాడు ప్రారంభించారు. వందేమాతరంపై చర్చలో పాల్గొన్నందుకు గర్వపడుతున్నానన్నారు. జాతీయ గేయం చరిత్రతో

...:: మిగతా 2లో



మేడ్చల్ -మల్కాజ్‌గిరిలో అభివృద్ధి శూన్యం

- 32 లక్షల జనాభా ఉన్నా సరైన ఆస్పత్రి లేదు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపాటు

...:: వివరాలు 3లో

గజగజ వణికిస్తున్న చలి

- రాష్ట్రంలో రెండు రోజులు ఇదే స్థితి
- పలు ప్రాంతాలలో పడిపోయిన ఉష్ణోగ్రతలు
- ఉత్తర తెలంగాణలో వీస్తున్న చలిగాలులు
- అప్రమత్తంగా ఉండాలన్న వాతావణ శాఖ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 8 : తెలంగాణలో రెండు రోజుల పాటు చలిగాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉమ్మడి ఆదిలాబాద్ తో పాటు సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలలో చలి తీవ్రత అధికంగా ఉండే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. కొన్ని ప్రాంతాలలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలోకి క్రింది స్థాయి గాలులు ప్రధానంగా ఈశాన్య దిశ నుంచి వీస్తున్నాయని తెలిపింది. రాత్రి నుంచి ప్రారంభం అవుతున్న చలి ఉదయం పూట తీవ్ర స్థాయిలో ఉంటోంది. చలి తీవ్రతకు ఇంటిలో నుంచి అడుగు బయట పెట్టాలంటే వణుకు పుడుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, నిర్మల్ వంటి జిల్లాలో సాధారణ ఉష్ణోగ్రతలు మరింత కనిష్టానికి పడిపోతున్నాయి.

వెచ్చని దుస్తులు ధరించడం

చలిగాలుల ప్రభావం నుంచి తమను తాము కాపాడుకోవడానికి ప్రజలు తగు చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఈ చలి తీవ్రత నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారి పట్ల అదనపు శ్రద్ధ వహించాలని చెబుతున్నారు. చలి తీవ్రత పెరిగే క్రమంలో ఉదయం వేళల్లో, రాత్రి సమయాల్లో వెచ్చని దుస్తులు ధరించడం, అవసరమైతే తప్ప బయటకు రాకుండా ఉండటం మంచిదని వైద్యనిపుణులు చెబుతున్నారు. పొగమంచు, చలి కారణంగా వాహనదారులు కూడా రహదారులపై పలు జాగ్రత్తలు పాటించి ప్రయాణించాలని హెచ్చరించారు. ఉదయం చలికాలంలో ప్రమాదాలు జరగడానికి ఎక్కువగా అవకాశాలు ఉంటాయన్నారు.

హైదరాబాద్‌లో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

రోజురోజుకు హైదరాబాద్ నగరంలో చలి తీవ్రత

...:: మిగతా 2లో





'ఇండిగో' పై చర్యలు తప్పవు

ఇండిగో సంక్షోభంపై పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు సోమవారం రాజ్యసభలో స్పందించారు. కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

7



మోడీ ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతోంది

ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యలను కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రా తిప్పికొట్టారు. ఆయన ఆత్మవిశ్వాసం రోజురోజుకూ సన్నగిల్లుతోందన్నారు. సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం వందేమాతరంపై చర్చను చేపట్టిందని ఆరోపించారు.

7



విజయ్ సభకు షరతులతో అనుమతి

పుదుచ్చేరి లో టీవీకే పార్టీ చీఫ్ విజయ్ నిర్వహించతలపెట్టిన బహిరంగ సభకు అక్కడి పోలీసులు అనుమతి మంజూరు చేశారు. మంగళవారం ఉప్పాలంలోని ఎక్స్‌పో గ్రౌండ్ లో సభ జరగనుంది.

7



సిద్ధరామయ్యకు సుప్రీం నోటీసులు

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారని దాఖలైన పిటిషన్‌కు స్పందించిన సుప్రీంకోర్టు ఆయనకు సోమవారం నోటీసులు జారీ చేసింది.

7

రాష్ట్రీయం



బెంగళూరుతో హైదరాబాద్ పోటీ

- కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

బెంగళూరుతో హైదరాబాద్ పోటీ పడుతోందని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. తర్వాత తరానికి ఏం కావాలో ఈ ప్రభుత్వం ఆలోచించిందని తెలిపారు. చిన్న రాష్ట్రమైనప్పటికీ తెలంగాణ కూడా గొప్ప వాటా కలిగి ఉందని కొనియాడారు. కాలిఫోర్నియా వంటి నగరాల్లో 13 లక్షల మంది భారత ఇంజినీర్లు పని చేస్తున్నారని గుర్తు చేశారు. ఐటీ కంపెనీలకు బెంగళూరు, హైదరాబాద్ గమ్యస్థానంగా ఉన్నాయని అన్నారు. తెలంగాణ, బెంగళూరుకు కేంద్రం మరింత సహకారం అందిస్తుందని ఆశిస్తున్నామని తెలిపారు.

ప్రత్యేక ఆకర్షణగా రోబో... సీఎంకు హాయ్ అంటూ పలకరింపు

గ్లోబల్ సమ్మిట్ లో రోబో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వచ్చిన అతిథులకు స్వాగతం పలకడంతో పాటు గ్లోబల్ సమ్మిట్ లక్ష్యాలను అందరికీ వివరిస్తోంది రోబో. ఇక గ్లోబల్ సమ్మిట్ కు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా రోబో హాయ్ అంటూ పలకరించింది. తిరిగి ముఖ్యమంత్రి కూడా రోబోకు హాయ్ చెబుతూ ముందుకు సాగారు. గ్లోబల్ సమ్మిట్ లో ఈ రోబో అందరినీ ఆకట్టుకుంటోంది. అలాగే గ్లోబల్ సమ్మిట్ లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సీఎం పరిశీలించారు. ముఖ్యమంత్రితో సినీ నటుడు నాగార్జున కూడా ఉన్నారు. గ్లోబల్ సమ్మిట్ ఆరంభ వేడుకలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, వివిధ రంగాలకు చెందిన దేశ, విదేశాల ప్రముఖులు హాజరయ్యారు.

తెలంగాణ విజన్‌ను ఈ సమిట్ ప్రతిబింబిస్తోంది: కరణ్ అదానీ

తెలంగాణ విజన్‌ను ఈ సమిట్ ప్రతిబింబిస్తోందని ఆదాని గ్రూప్ ప్రతినిధి కరణ్ అదానీ అన్నారు. గ్రీన్ డేటా సెంటర్స్, రెన్యువబుల్ ఎనర్జీలో ఇప్పటికే పెట్టుబడులు పెడుతున్నామన్నారు. సిమెంట్ రంగంలో కూడా అదానీ గ్రూప్ పెట్టుబడులు పెడుతోందని తెలిపారు. గత మూడేళ్లలో ఇప్పటికే రూ.10 వేల కోట్ల పెట్టబడులు పెట్టామని కరుణ్ ఆదాని తెలిపారు. అదానీ గ్రూప్ తెలంగాణలో డిఫెన్స్, ఏరోస్పేస్ పార్క్‌ను ఏర్పాటు చేసిందన్నారు.

ఫ్యూచర్ సిటీ

ఆలోచన బాగుంది: నాగార్జున

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను భట్టి విక్రమార్క, నాగార్జున పరిశీలించారు. అనంతరం మీడియాతో నాగార్జున మాట్లాడారు. 50 ఏళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నామని.. ఇక్కడ వాతావరణం బాగుందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో అన్నపూర్ణ స్టూడియో ఉందని.. ఫ్యూచర్ సిటీలో మరో స్టూడియో నిర్మాణానికి బాలీవుడ్ ప్రముఖులు కలిసి ముందుకు రావడం మంచి పరిణామమని చెప్పుకొచ్చారు. అందరూ కలిసి వస్తే ప్రపంచ వ్యాప్త ఫెసిలిటీస్‌తో పెద్ద నిర్మాణం చేయవచ్చని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న ఫ్యూచర్ సిటీ ఆలోచన బాగుందని నటుడు నాగార్జున ప్రశంసించారు.

'వికసిత్ భారత్' దిశగా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

ప్రారంభించారు. అనంతరం ప్రసంగించారు.

2047లోగా త్రీ ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారాలనేది తమ లక్ష్యం అని ప్రకటించారు. బస్సుల నిర్వహణ కూడా మహిళా సంఘాలకు ఇచ్చామని, విమానాశ్రయాలు, రైల్వేలు, రోడ్ల విస్తరణ దిశగా చర్యలు చేపట్టామని గవర్నర్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు ఫ్యూచర్ సిటీ 100 ఎకరాల విస్తీర్ణంలో రెండు రోజుల పాటు ఈ సమ్మిట్ జరగుతోంది. నిర్ణీత లక్ష్యాలు నిర్దేశించుకొని తెలంగాణ ముందుకెళ్తోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సమ్మిట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి డిజిటల్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

పరిశ్రమల హబ్‌గా తెలంగాణ

తెలంగాణ గ్లోబల్ సమిట్ విజయవంతమైందని, ఈ రాష్ట్రం ప్రత్యేక విజన్‌తో ముందుకెళ్తోందని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాస్ సత్యార్థి అన్నారు. 20 లక్షల మంది రైతుల రుణాలు మాఫీ చేశారని, మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించే అవకాశం కల్పించారని గుర్తు చేశారు. వికసిత్ భారత్ లక్ష్యం దిశగా ఈ రాష్ట్రం అడుగులు వేగంగా పడుతన్నాయన్నారు. 2047లోగా త్రీ ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారుతుందని కూడా చెప్పారు. గాంధీ, నెహ్రూ చూపిన దారిలో రేవంత్‌రెడ్డి పాలన నడుస్తోందని ప్రసంసించారు."బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అసాధ్యం. సమస్యలకు ప్రతి భారతీయుడూ ఒక పరిష్కారం చూపిస్తాడన్నారు. ఐకమత్యం, శాంతియుత పరిస్థితులతోనే అభివృద్ధి సాధ్యమని వివరించారు. మొత్తం ప్రపంచాన్ని ఒకే కుటుంబంగా చూస్తామని, ప్రపంచం ఎదుర్కొనే అనేక సమస్యలకు భారత్ వద్ద పరిష్కారిస్తుందని, అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వాల నినాదం కావాలి.అని కైలాస్ సత్యార్థి కోరారు.

నగరంలో రియల్టర్ దారుణ హత్య

- పట్టపగలే నడిరోడ్డుపై ఘాతుకం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 8: నగరంలోని జవహర్ నగర్ పీఎస్ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారి వెంకట రత్నం అత్యంత కిరాతకంగా హత్యకు గురయ్యారు. సాకేత్ కాలనీలో పోస్టల్ బిల్లా బాంగ్ స్కూల్ వద్ద తన కూతురుని యాక్టీవాపై దింపి తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పక్కా ప్లాన్ ప్రకారం స్కూల్ సమీపంలో మాటువేసిన దుండగులు వెంకటరత్నం బైక్ ను వెంబడించారు. ఆటోలో నలుగురు, బైక్ పై మరో ఇద్దరు ఫాలో అయ్యారు. స్కూల్ దాటిన కొద్ది సేపటికే ముందుగా బైక్ పై ఉన్న దుండగులు వెంకటరత్నంపై తుపాకీతో కాల్పులు జరిపారు. బైక్ పై నుండి క్రింద పడిన వెంకటరత్నంపై వెంటనే ఆటోలో వచ్చిన నలుగురు దుండగలు, తమ వెంట తెచ్చుకున్న కత్తులతో అత్యంత కిరాతంగా నరికి చంపారు. నడి రోడ్డుపై చుట్టూ జనసంచారం ఉండగానే రియల్టర్ హత్యకు గురుకావడంతో స్థానికులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. హత్యను అడ్డుకునే సాహసం ఎవరూ చేయలేకపోయారు. వెంకటరత్నం ప్రాణాలు కోల్పోయాడని నిర్ధారించుకున్న తరువాత వారు అక్కడి నుంచి పరారయ్యారు. హత్య జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరా విజువల్స్ సేకరించిన పోలీసులు నిందితులు వచ్చిన ఆటో, బైక్‌లను గుర్తించారు. నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ధూల్ పేట్ లో వెంకటరత్నంపై జంట హత్యల కేసులో ఆరోపణలున్నాయి. రౌడీ షీట్ నమోదైంది. ఈ నేపథ్యంలో పాత కక్షలే రియల్టర్ ప్రాణాలు తీశాయని పోలీసులు అనుమానిస్తున్నారు.



గోదావరిఖని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా మాధవరావు

- ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, డిసెంబర్ 8: దశాబ్దల చరిత్ర గలిగిన గోదావరిఖని ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయింది. స్థానిక ప్రెస్ క్లబ్ లో జరిగిన ఎన్నికలలో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన జర్నలిస్టులు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మాధవరావు, ప్రధాన కార్యదర్శిగా గడ్డం శ్యాం కుమార్, కోశాధికారిగా తాడబోయిన రాజ్ కుమార్, ఉపాధ్యక్షులుగా సుధాకర్ రావు, తగరపు శంకర్, జీవన్ బాబు, కేసు వాసు, సమ్మయ్య, సంయుక్త కార్యదర్శి గా బిక్షపతి, కుమారస్వామి, మామిడి అశోక్, సురభి శ్రీధర్, ఆర్గనైజ్ సెక్రెటరీ గోలి సమ్మిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా దయానంద్ గాంధీ, భాస్కర్ రాంశంకర్, సదానందం, పి.కిశోర్, శ్రీనివాస్, కోల లక్ష్మణ్, కొండార్ రెడ్డి,జి. రవీందర్, శ్రీధర్,కె. మనోహర్ రెడ్డి, దినేష్,తిరుపతి, బొల్లం మధుబాబు, మూల శంకర్, వరుణ్, రంగు శ్రీనివాస్,ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సీనియర్ జర్నలిస్టులు ఎల్లంకి లచ్చయ్య పాలకుర్తి విజయ్ కుమార్ మ్యాజిక్ రాజా వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు పూదరి కుమార్ గౌడ్, మాజీ ప్రధాన కార్యదర్శి పందిళ్ల శ్యాంసుందర్,సీనియర్ పాత్రికేయులు మాదాసు రామ్మూర్తి, వంశి, కోల లక్ష్మణ్, మారుతి, జక్కం సత్యనారాయణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి రేసులో తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

అని వివరించారు. తెలంగాణ ప్రజలు దశాబ్దాలుగా ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారని గుర్తు చేశారు. 2014లో సోనియా గాంధీతోపాటు నాటి ప్రధాని డా. మన్మోహన్ సింగ్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం కల సాకారమైందని తెలిపారు.

అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణ

తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతుందని ముఖ్యమంత్రి తెలిపారు. 2047కు సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నామన్నారు. తెలంగాణ త్రీ ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదగాలన్నదే తమ ఆశయమని స్పష్టం చేశారు. ఈ విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తల సూచనలను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం అనంతరం మన నాయకులు కొత్త రాజ్యాంగాన్ని రూపొందించడం ద్వారా భవిష్యత్తుకు రోడ్ మ్యాప్ వేశారని వివరించారు. అలాగే, తాము సైతం తెలంగాణ భవిష్యత్తు కోసం రోడ్ మ్యాప్ రూపొందించాలని అనుకున్నామన్నారు. అందుకు మహాత్మా గాంధీ, డా. బీఆర్ అంబేడ్కర్ తదితరుల నుంచి ఎంతో స్ఫూర్తి పొందామని చెప్పారు. దేశానికి స్వాతంత్రం సిద్ధించి 2047లో వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని, నాటికి మనం ఏం సాధించామో చెప్పాలని నిపుణులను కోరినట్లు సీఎం తెలిపారు. ఆ సమయంలోనే తెలంగాణ రైజింగ్ 2047 దార్శనికతకు బీజం పడిందని గుర్తు చేశారు. 'మనమేదైనా గొప్పగా చేయాలని భావించినప్పుడు తెలంగాణ సంస్కృతిలో ముందుగా దేవుళ్ల ఆశీర్వాదం తీసుకుంటాం. ప్రజల మద్దతు కోరుతామని' అన్నారు. భవిష్యత్తు కోసం మన కలలు నెరవేర్చుకోవడానికి ప్రజల ఆలోచనలు, అంచనాలు తెలుసుకున్నామన్నారు. అందుకు అధికారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, నీతి ఆయోగ్ నిపుణుల సహాయం తీసుకున్నామన్నారు.

అదృష్టంగా భావిస్తున్నా

ఈ గ్లోబల్ సమ్మిట్‌కు అన్ని రంగాలకు చెందిన ప్రతినిధులు రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. వ్యాపారవేత్తలు, కార్పొరేట్ దిగ్గజాలు, విధాన నిర్ణేతలు, దౌత్యవేత్తలు, ప్రభుత్వ అధికారులతోపాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులకు సీఎం ధన్యవాదాలు చెప్పారు. ఈ సమ్మిట్‌లో వారి సూచనలు, సలహాలు, అభిప్రాయాలు స్వీకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తెలంగాణలో అపారమైన అవకాశాలు ఉన్నాయని వివరించారు. మంచి సానుకూల వాతావరణం కూడా ఉందన్నారు. భారతదేశంలో తెలంగాణ దాదాపు 2.9 శాతం జనాభా కలిగి ఉందని గుర్తు చేశారు. దేశ జీడీపీలో తెలంగాణ నుంచి దాదాపు 5 శాతం వాటాను అందిస్తున్నామన్నారు. 2047 నాటికి భారత దేశ జీడీపీలో 10 శాతం వాటాను తెలంగాణ నుంచి అందించాలన్నది తమ లక్ష్యమన్నారు. చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్ సాధించిన అభివృద్ధి గురించి సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. చైనాలోనే ఈ ప్రావిన్స్ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అని తెలిపారు. 20 యేండ్లలోనే వారు ప్రపంచంలోనే అత్యధిక పెట్టుబడులతోపాటు వృద్ధి రేటు సాధించారని వివరించారు. తెలంగాణలో సైతం తాము అదే నమూనాను అనుసరించాలని భావిస్తున్నామని చెప్పారు.

తెలంగాణ విజన్ డాక్యుమెంట్

మొదటిపేజీ తరువాయి

అందరికీ డిప్యూటీ సీఎం హృదయపూర్వక ఆహ్వానం పలికారు. తెలంగాణకు ఆశయాల కొరత ఎప్పుడూ లేదు. కానీ ఎంతో కాలంగా ప్రజల శక్తిని, వారి ఆశలను, సామర్థ్యాన్ని ఒకే దారిలో నడిపించే సమగ్ర దృష్టి మాత్రమే కొరవడింది అన్నారు. ఈ రోజు ఆ సమగ్ర డాక్యుమెంటును ఆవిష్కరిస్తున్నాం అన్నారు. మా దూరదృష్టి ఒక సంవత్సరం కోసం కాదు, ఒక ఎన్నికల కాలం కోసం కాదు, 2047 వరకూ ఉన్న దీర్ఘకాల లక్ష్యంతో నిర్మించిన విజన్ ఇది అన్నారు.

మా విజన్ నాలుగు స్తంభాలపై నిలబడి ఉంది

అందులో మొదటిది 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ ఇది కేవలం నినాదం కాదు, అన్ని రంగాలవారీగా, జిల్లాలవారీగా రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక అని వివరించారు. స్పేషియల్ ప్లానింగ్‌కు కొత్త వ్యాకరణం.. క్యూర్, ప్యూర్, రేర్.. సమగ్ర అభివృద్ధిపై అచంచల కట్టుబాటు. సస్టైనబిలిటీనీ ఆవిష్కరణాత్మకంగా సహకారం చేయడం అన్నారు. 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ ఇది సంఖ్య కాదు, ఇది తెలంగాణ వాస్తవాన్ని మార్చే శక్తి అన్నారు.

'వందేమాతరం' చరిత్రకు నిదర్శనం

మొదటిపేజీ తరువాయి

ముడిపడిన అనేక ఘట్టాలను మన కళ్ల ముందుకు తీసుకొస్తుందని, ఈ మధ్యే మనం రాజ్యాంగ 75 యేండ్ల సంబరాలు జరుపుకుందని గుర్తు చేశారు. ఎన్నో ఘట్టాలను దాటుకుంటూ వెళ్లిందని కొనియాడారు. వందేమాతర గీతానికి, దాని గౌరవాన్ని తిరిగి తెచ్చి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎమర్జెన్సీ ఉక్కుపాదం కింద వందేమాతరాన్ని తొక్కిపెట్టారని, వందేమాతరం చర్చ విషయంలో స్వపక్షం, విపక్షం అంటూ ఎవరూ లేరన్నారు. స్వాతంత్ర్య సంగ్రామం ఫలితంగానే మనందరం ఇక్కడ ఉన్నామని, దేశం మొత్తం వందేమాతర గీతం స్ఫూర్తితో ఏకమైందని గుర్తు చేశారు. 'మన అసంఖ్యాక స్వాతంత్ర్య సమరయోధులు 'వందేమాతరం' అని నినదించి ఉరిశిక్షను స్వీకరించారు. వివిధ జైళ్లలో ఇది జరిగింది. కానీ, అందరి నోటా మంత్రం ఒక్కటే 'వందేమాతరం'. అదే సమయంలో స్వాతంత్ర్య పోరాటంలో ప్రారంభించిన, వందేమాతరం పేరుతో ఉన్న వార్తాపత్రికలు కొన్ని ఉన్నాయి' అని ప్రధాని మోడీ అన్నారు. 'వందేమాతరం'ను వ్యతిరేకించడంలో నెహ్రూ, మహ్మద్ అలీ జిన్నాను అనుసరించారని తీవ్ర ఆరోపణలు చేశారు.

భవిష్యత్తు కోసం ఎదురుచూడం.. నిర్మిస్తాం!

- మా ప్రతి అడుగు, ఆలోచన భావితరాల కోసమే
- "ఫీనిక్స్" పక్షి స్ఫూర్తితోనే "తెలంగాణ రైజింగ్"కు శ్రీకారం
- 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చేలా దార్శనికతతో కూడిన అడుగులు
- "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్" ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు



ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్8: భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా... దానిని మనం నిర్మించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. మేం వేసే ప్రతి అడుగు... చేసే ఆలోచన భావితరాల ఆశయాలు, అవసరాలకు అనుగుణంగా "రేపటి తెలంగాణ" కోసమే అని వివరించారు. "ఫీనిక్స్" పక్షి స్ఫూర్తితో ఇన్నోవేషన్, హ్యూమన్ క్యాపిటల్, సస్టైనబులిటీ, గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్ గా తెలంగాణను మార్చాలనే లక్ష్యంతోనే "తెలంగాణ రైజింగ్" కు శ్రీకారం చుట్టామన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న ఎకనామిక్ రీ అలైన్‌మెంట్స్, టెక్నలాజికల్ డిస్రప్షన్, క్లైమేట్ అన్‌సెర్టెనిటీ లాంటి సవాళ్లను అవకాశాలుగా మార్చుకొని 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చేందుకు దార్శనికతతో కూడిన అడుగులు వేస్తున్నామన్నారు. ఈ ప్రయాణంలో తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో తమ ప్రభుత్వం వేసిన తొలి అడుగు "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025" అని అన్నారు. భౌగోళిక విస్తీర్ణం, జనాభాలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ చిన్నదే అయినా దేశ జీడీపీలో మాత్రం 5 శాతం వాటాను కలిగి ఉందన్నారు. 2024-25 లో రాష్ట్ర జీఎస్డీపీ వృద్ధి రేటు 10.1 శాతం కాగా, జాతీయ సగటు 9.9 శాతంగా నమోదు అయ్యిందన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3.79 లక్షలు, జాతీయ సగటు కంటే 1.8 రేట్లు ఎక్కువ అని వివరించారు. రాష్ట్ర ఇండస్ట్రియల్, మాన్యుఫ్యాక్చరింగ్ ఎకానమీ వృద్ధి రేటు 7.6 శాతం కాగా, జాతీయ సగటు 6.6 శాతం మాత్రమే అన్నారు. రాష్ట్ర సేవల రంగం వృద్ధి రేటు 11.9 శాతంగా కాగా, అదే జాతీయ సగటు 10.7 శాతంగా ఉందన్నారు. రాష్ట్ర ఇండస్ట్రియల్ జీఎస్ వీఏ 12.6 శాతం వృద్ధి రేటుతో రూ.2.46 లక్షల కోట్ల నుంచి రూ.2.77 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. మాన్యుఫ్యాక్చరింగ్, కన్ స్ట్రక్షన్, మైనింగ్, క్వారీయింగ్, ఎలెక్ట్రిసిటీ, గ్యాస్, వాటర్, ఇతర యుటిలిటీస్ లాంటి ఇండస్ట్రియల్ సబ్ సెక్టార్లలోనూ తెలంగాణ వృద్ధి రేటు జాతీయ సగటు కంటే ఎక్కువగా నమోదు కావడం తమ ప్రభుత్వ పనితీరుకు నిలువెత్తు నిదర్శనమన్నారు. దేశంలోనే తొలి ఏఐ పవర్డ్ విలేజ్ గా మారిన మంథని నియోజకవర్గంలోని ఒక మారుమూల గ్రామం "రేపటి తెలంగాణ"కు మార్గదర్శిగా నిలిచిందన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ, తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్, ఏఐ ఆధారిత తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్, ఏఐ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ, అడ్వాన్స్డ్ ఐటీఐలు, ఏఐ ఆధారిత అకడమిక్ కరిక్యులం, యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్, లైఫ్ సైన్సెస్ హబ్ "వన్ బయో", సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ క్వాంటం టెక్నాలజీ లాంటి విప్లవాత్మక అడుగులు ప్రపంచ పటంలో "తెలంగాణ"ను ప్రత్యేకంగా నిలుపుతాయన్నారు. రేపటి కోసం, భవిష్యత్ తరాలకు భరోసాగా తెలంగాణతో కలిసి భవిష్యత్తును నిర్మించేందుకు ముందుకు రావాలని ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, నిపుణులకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం పలికారు.

వణికిస్తున్న చలి

మొదటిపేజీ తరువాయి

పెరుగుతోంది. చాలా ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. వైరల్ వ్యాధులు కూడా విజృంభిస్తున్నాయి. పిల్లల నుంచి పెద్దల వరకు జలుబు, దగ్గు, జ్వరం, ముక్కుకారటం లాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. న్యుమోనియా, ఇన్‌ఫ్లూయెంజా కేసులు కూడా పెరుగుతున్నాయి. ముఖ్యంగా చలికాలంలో సరైన ఆహారపు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా విటమిన్లు, మినరల్స్‌తో వ్యాధి నిరోధక శక్తి పెంపొదించుకోవచ్చునని ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజారావు తెలిపారు.

తొలి రోజే రికార్డు స్థాయిలో పెట్టుబడులకు ఎంఓయూ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 08: రాష్ట్ర ఖ్యాతిని ఘనంగా చాటేలా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'ను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుంది. ఈ సమిట్లో తెలంగాణ ప్రభుత్వం అంచనాకు మించి వివిధ కంపెనీలు, సంస్థలతో ఎంవోయులు చేసుకుంది. నేడు ఒక్క రోజే రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూలను రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకుంది. ఒక్క పవర్ సెక్టార్ లోనే రెండు లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఓయూ కుదిరింది. ఫ్యూచర్‌సిటీలో కొత్త జూ పార్క్ ఏర్పాటుకు గుజరాత్‌లోని వన్యప్రాణుల పునరావస కేంద్రం వంతారా యాజమాన్యం ముందుకొచ్చింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో వంతారా బృందం ఎంవోయూ కుదుర్చుకుంది. ప్రభుత్వ పరంగా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని సీఎం ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. రేపు ఐటీ , వినోదం సెక్టార్ లో కూడా తెలంగాణ ప్రభుత్వం ఎంఓయూ చేసుకోనుంది.

అతిరథ్ హోల్డింగ్స్ నుంచి తెలంగాణకు ₹4,000 కోట్లు

తెలంగాణ రైజింగ్ సమ్మిట్ లో అతిరథ్ హోల్డింగ్స్ రాష్ట్రంలో 25 కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లను ₹4,000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. నాపియర్ గడ్డిని ఉపయోగించి శుభ్రమైన ఇంధనం తయారు చేసే ఈ ప్రాజెక్ట్ రైతులకు ఆదాయం, గ్రామీణ ఉపాధి కల్పించనుంది. ముఖ్యమంత్రి ఈ పెట్టుబడిని స్వాగతించారు.

వంతారా–తెలంగాణలో వరల్డ్ క్లాస్ నైట్ సఫారీ

రిలయన్స్ వంతారా, తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుని భారత్ ఫ్యూచర్ సిటీలో వైల్డ్‌లైఫ్ కన్జర్వేటరీ మరియు నైట్ సఫారీని ఏర్పాటు చేయనుంది. ప్రపంచ స్థాయి సంరక్షణ, పర్యాటకానికి ఇది ప్రధాన ప్రాజెక్ట్‌గా



నిలుస్తుందని ప్రభుత్వం తెలిపింది.

సూపర్‌క్రాస్ ఇండియా–హైదరాబాద్‌లో అంతర్జాతీయ రేసింగ్ సదుపాయం

సూపర్‌క్రాస్ ఇండియా భారత్ ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ ప్రమాణాల సూపర్‌క్రాస్ & మోటోక్రాస్ రేసింగ్ ట్రాక్ నిర్మించనున్నట్లు ప్రకటించింది. యువతకు అవకాశాలు, క్రీడా పర్యాటకానికి ఇది పెద్ద ఊతమని ప్రభుత్వం పేర్కొంది.

సల్మాన్ ఖాన్ వెంచర్స్ నుంచి ₹10,000 కోట్లు: టౌన్‌షిప్–స్టూడియో ప్రాజెక్ట్

సల్మాన్ ఖాన్ వెంచర్స్ రాష్ట్రంలో ₹10,000 కోట్లతో లగ్జరీ టౌన్‌షిప్ మరియు ఆధునిక ఫిల్మ్ స్టూడియో ఏర్పాటు చేయనుంది. గోల్ఫ్ కోర్స్, రేస్ కోర్స్, నేచర్ ట్రైల్స్, స్టూడియో కాంప్లెక్స్‌తో కూడిన ఈ ప్రాజెక్ట్ వేలాది ఉద్యోగాలను సృష్టించనుంది.

అపోలో–తెలంగాణ ఆరోగ్యరంగ బలోపేతానికి కీలక ఒప్పందం


అపోలో హాస్పిటల్స్, తెలంగాణ ప్రభుత్వంతో మరో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. కొత్త 400 బెడ్ హాస్పిటల్, 200 కొత్త ఫార్మసీలు, ₹800 కోట్లతో డీమ్డ్ యూనివర్సిటీ ఏర్పాటుతో ఆరోగ్య-విద్యా రంగాలను విస్తరించనున్నది.

యూనివర్సిటీ ఆఫ్ లండన్–తెలంగాణలో ఉన్నత విద్య భాగస్వామ్యం

టెలంగానా ప్రభుత్వం-యూనివర్సిటీ ఆఫ్ లండన్ మధ్య అకాడమిక్, రీసెర్చ్, ఇంటర్నేషనల్ స్టూడెంట్ మొబిలిటీ రంగాల్లో సహకారం పెంచేందుకు ఒప్పందం కుదిరింది. రాష్ట్రాన్ని గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం.

ట్రంప్ మీడియా..5 బిలియన్ డాలర్ల పెట్టుబడి

ట్రంప్ మీడియా & టెక్నాలజీ గ్రూప్ తెలంగాణలో 5 బిలియన్ డాలర్ల పెట్టుబడితో నెక్స్ట్-జెన్ స్మార్ట్ & ఇంటెలిజెంట్ సిటీల అభివృద్ధికి ఒప్పందం కుదుర్చుకుంది. ఏఐ ఆధారిత నగర పాలన, డిజిటల్ మౌలిక వసతులు, భవిష్యత్ నగర సేవలు అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించింది.



ప్రజలకు కావాల్సిన ప్రభుత్వ సేవలన్నీ సంక్రాంతి నుంచి ఆన్‌లైన్‌లోనే అందించాలి. వాట్సాప్ గవర్నెన్స్‌పై విస్తృతంగా ప్రచారం చేయాలి. రిజిస్ట్రేషన్ల తర్వాత డాక్యుమెంట్లను నేరుగా ఇళ్లకే పంపించాలి. ఆర్టీసీ బస్టాండ్లు, టాయ్‌లెట్ల వద్ద పరిశుభ్రతను మెరుగుపర్చాలి. రైతులకు డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పించాలి.
- ఆర్టీజీఎస్‌పై సమీక్షలో ఏపీ సీఎం చంద్రబాబు

రాష్ట్రీయం

తెలంగాణ రైజ్ మాత్రమే కాదు, ఇండియా రైజ్

- నోబెల్ బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి
- అట్టహాసంగా గ్లోబల్ సమ్మిట్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 8 : తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఇది కేవలం సదస్సు మాత్రమే కాదని, ఇంత పెద్ద కార్యక్రమానికి ప్రపంచం నుంచి పెట్టుబడుదారిలో పారిశ్రామికవేత్తలు తోపాటు అనేకమంది హాజరు కావడంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజయం సాధించారని నోబెల్ బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి అన్నారు. తెలంగాణ వివిధ జాతులకు చెందిన సాంస్కృతి సాంప్రదాయాలకు నెలవైందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అత్యధికంగా ఖర్చు చేయడం అద్భుతమైనది అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో 2034 సంవత్సరానికి ఒకటి తెలియని ఎకానమీగా చేరుకోవడం చాలా సులభం అన్నారు. ఇది 2047 3 టిలియన్ ఎకానమీగా చేరుకోవడానికి పెద్ద సమయం తీసుకోదన్నారు. గ్లోబల్ సమ్మెట్లో గాంధీ చిత్రపటానికి ఆయన విజన్ కు ప్రాధాన్యత ఇవ్వడం సంతోషకరమైన అంశం అన్నారు. మొట్టమొదటి ప్రధానిగా నెహ్రూ బాధ్యతలు చేపట్టిన తర్వాత మహాత్మా గాంధీతో కలిసిన సందర్భంలో నా దేశాన్ని ఎలా ముందుకు తీసుకువెళ్లాలి అనే అంశాన్ని ప్రధానంగా మాట్లాడారని, నేడు రేవంత్ రెడ్డి అదే మహాత్మా గాంధీ ఆశయాలతో తెలంగాణను అభివృద్ధి పథంలోకి నడిపించనున్నారని అన్నారు. ప్రపంచం బాధ్యతాయుతమైన, శాంతి లోపంతో ఉందని అన్ని రంగాల అభివృద్ధితో ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుందని, అది తెలంగాణ రైజింగ్ తో సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రపంచంతో పడుతున్న పోటీలో విజయం సాధిస్తు దని అన్నారు.

ఇది ఆవిష్కరణ, పెట్టుబడుల కలయిక
మాజీ సీఐఐ ప్రెసిడెంట్, టీవీఎస్ సప్లై చైన్ సొల్యూషన్ ఎగ్జిక్యూటివ్ దినేష్

రాష్ట్ర ప్రభుత్వం ఇంత భారీగా నిర్వహిస్తున్న కార్యక్రమం కేవలం సాధారణ సదస్సు కాదని, ఇది ఆవిష్కరణ పెట్టుబడుల కలయిక అని అన్నారు. రాష్ట్రం అత్యంత రక్షణతో కూడిన పారిశ్రామిక అభివృద్ధిగా ఉంటుందని మాజీ సీఐఐ ప్రెసిడెంట్, టీవీఎస్ సప్లై చైన్ సొల్యూషన్ ఎగ్జిక్యూటివ్ దినేష్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం సుదీర్ఘంగా కలసి పనిచేస్తామని హామీ ఇచ్చారు.

మరొక ఫార్మా విప్లవానికి నాంది
అపోలో హాస్పిటల్స్ చైర్మన్ శోభన కామినేని

భారత ఫ్యూచర్ సిటీ మరొక ఫార్మా విప్లవానికి నాంది పలకనుందని అపోలో హాస్పిటల్స్ చైర్మన్ శోభన కామినేని అన్నారు. ప్రపంచ దేశాలకు ఎగుమతి అయ్యే ఫార్మా ఉత్పత్తులలో అధిక శాతం రాష్ట్రం నుంచి ఉన్నాయని తెలిపారు. గడచిన మూడేళ్లలో తెలంగాణ వైద్యరంగంలో నూతన ఓరవడిని సాధించింది అన్నారు. దేశంలోని ఫార్మసిటికల్ కంపెనీలలో మూడవ వంతు తెలంగాణలోనే ఉన్నాయన్నారు. జీనోమ్ వ్యాలీ ఆసియాలోని అతిపెద్ద బయోసిటీ అని, ఈ ఉదాహరణతో భారత్ ఫ్యూచర్ సిటీ మరొక అతిపెద్ద బయోసిటీగా రూపాంతరం చెందుతుందని పేర్కొన్నారు.

అధాని గ్రూప్ భాగస్వామ్యం అవుతుంది: కరణ్ అదాని

రాష్ట్రంలో ప్రధాని గ్రూప్ అనేక రంగాలలో పెట్టుబడులు పెట్టిందని తద్వారా రాష్ట్ర ఆర్థిక ఎదుగుదలకు తమ వంతుగా చేయూత అందిస్తుందని అదాని పోర్ట్స్ అండ్ సెజ్ మేనేజింగ్ డైరెక్టర్ కరణ్ అదాని అన్నారు. ఈ సమ్మిట్ రాష్ట్రప్రభుత్వం విజన్, నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. గడచిన మూడు సంవత్సరాలలో రాష్ట్రంలో అనేక నిర్మాణ రంగాలలో ప్రధాని గ్రూప్ సహకారాన్ని తెలిపారు.



'ఇందిరా మహిళా శక్తి' స్టాల్ ప్రారంభించిన సీతక్క

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్8 : భారత్ ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ లో మహిళా సాధికారతను ప్రతిబింబించే "ఇందిరా మహిళా శక్తి" స్టాల్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఘనంగా ప్రారంభించారు. స్టాల్‌ను సందర్శించిన అనంతరం ఆమె మాట్లాడుతూ, "మహిళ ఎదిగితే కుటుంబం ఎదుగుతుంది. సమాజం ఎదుగుతుంది. రాష్ట్రం ఎదుగుతుంది. అందుకే మా ప్రభుత్వం మహిళ శక్తిని కేంద్రబిందువుగా చేసుకుని పని చేస్తోంది. ఈ స్టాల్‌లో కనిపిస్తున్న ప్రతీ విజయకథ మా తెలంగాణ మహిళల ఆత్మవిశ్వాసానికి, పట్టుదలకు నిలువెత్తు నిదర్శనం" అని పేర్కొన్నారు. సెర్ప్ మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా రూపొందించిన ఈ స్టాల్‌లో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ఆధ్వర్యంలో మహిళల చేతుల్లో నడుస్తున్న విభిన్న వ్యాపారాలు, సేవలు, ఆర్థిక కార్యకలాపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల నిర్వహణలో ఉన్న పెట్రోలు బంకులు, హైటెక్ సిటీలో పనిచేస్తున్న మహిళా శక్తి బజార్, జిల్లాల వ్యాప్తంగా నిర్మితమైన మహిళా శక్తి భవనాలు, శక్తి క్యాంటిన్లు, అలాగే ఆర్టీసీ అద్దె బస్సుల నిర్వహణలో మహిళలు సాధిస్తున్న విజయాలు దేశ విదేశాల ప్రతినిధులను ఆకట్టుకున్నాయి.



ఆమ్రపాలికి హైకోర్టులో చుక్కెదురు

- క్యాట్ ఉత్తర్వులపై స్టే

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్8: ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. ఆమెను తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఇచ్చిన ఉత్తర్వులపై ఉన్నత న్యాయస్థానం స్టే విధించింది. ఆమ్రపాలిని ఏపీకి కేటాయిస్తూ అక్టోబర్‌లో కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీవోపీటీ) ఉత్తర్వులు జారీ చేసింది. దాన్ని ఆమె క్యాట్లో సవాల్‌చేయగా ఆమ్రపాలిని తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఆదేశాలు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను డీవోపీటీ మళ్లీ హైకోర్టులో అప్పీల్ చేయగా విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం క్యాట్ ఉత్తర్వులను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి రాష్ట్ర విభజన నేపథ్యంలో తనను ఏపీ పర్యాటక క్యాడర్‌కు కేటాయిస్తూ కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆమ్రపాలి క్యాట్లో పిటిషన్ దాఖలు చేశారు. ఆమెను ఏపీ క్యాడర్‌కు పంపడంతో అక్కడ విధులు నిర్వహిస్తూనే క్యాట్‌ను ఆశ్రయించారు. ఆ సమయంలో ఆమ్రపాలి ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఎండీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమ్రపాలి పిటిషన్‌పై క్యాట్ జ్యుడిషియల్ సభ్యురాలు లతా బస్వరాజ్ పట్టే, పరిపాలనా సభ్యురాలు వరుణ్ సింధు కుల్‌కౌముదిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రత్యూష్ సిన్హా కమిటీ మార్గదర్శకాలను కొంతమంది అధికారులపై కఠినంగా, మరికొంతమందిపై సడలింపులు ఇస్తూ పక్షపాతం చూపడాన్ని క్యాట్ తప్పుబట్టింది.



మహిళా ఆధారిత అభివృద్ధి గ్లోబల్ మోడల్‌గా తెలంగాణ

- గ్లోబల్ సమ్మిట్ వేదికగా ఆకట్టుకున్న సీతక్క ప్రసంగం

ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్8: తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్-2025లో భాగంగా హాల్-4లో నిర్వహించిన 'వ్యాపార రంగంలో మహిళల నాయకత్వం - పానల్ డిస్కషన్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క పాల్గొని కీలక ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమానికి పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సీఈఓ దేవరాజన్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, హౌసింగ్ శాఖ ఎండి గౌతం, వికలాంగుల సాధికార శాఖ డైరెక్టర్ శైలజ హాజరయ్యారు. కార్యక్రమాన్నివి హబ్ సీఈఓ పల్లచోళ మోడరేట్ చేయగా, ప్యానెలిస్టులుగా జాతీయ గ్రామీణ అభివృద్ధి మాజీ అడిషనల్ కార్యదర్శి చరణ్జిత్ సింగ్, షాఫీ ఇండియా హెడ్ భారతి బాలకృష్ణన్, ప్రధాన్ ఇంటిగ్రేటర్ మధు కేతన్, ఏఐ సీఈఓ ఆర్. సంహితలు పాల్గొని మహిళా సాధికారతలో తెలంగాణ మోడల్ గా నిలుస్తుందని ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళలు ఎదిగితే దేశం ఎదుగుతుందని, మహిళలు సంపత్తిని సృష్టించగలిగితే అభివృద్ధి నిజమైన అర్థాన్ని సంతరించుకుంటుందని చెప్పారు. మహిళలు వ్యాపారాలు నడపడం ఆర్థిక వ్యవస్థకు అత్యంత స్థిరత్వాన్ని ఇస్తుందని, ఈ మార్పుకు తెలంగాణే నాయకత్వం వహిస్తుందని ఆమె స్పష్టం చేశారు. తెలంగాణ మహిళల ప్రతిభ, ఆవిష్కరణలు, సామాజిక-ఆర్థిక పురోగతిని ప్రపంచ వేదికపై ప్రతిధ్వనింపజేయడం ఈ గ్లోబల్ సమ్మిట్ లక్ష్యమని వెల్లడించారు. తెలంగాణ దేశంలోనే అతి పెద్ద, అత్యంత ప్రభావవంతమైన మహిళా నెట్‌వర్క్‌ను నిర్మించిన రాష్ట్రమని, 65 లక్షల స్వయం సహాయక సంఘాలు గ్రామీణ, పట్టణ ఆర్థిక వ్యవస్థను కొత్త దిశలో నడిపిస్తున్నాయని ఆమె వివరించారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా గ్రామీణ పేద మహిళల నుంచి వికలాంగులు, వృద్ధ మహిళలు, అట్టడుగు వర్గాలు, ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ వరకు అందరికీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని, ఒక మహిళ కూడా వెనుకబడిపోకూడదని తెలంగాణ ప్రభుత్వ సంకల్పమని సీతక్క చెప్పారు. తెలంగాణలో మహిళలు అవకాశాల కోసం ఎదురు చూడడం లేదని, అవకాశాలను స్వయంగా సృష్టించే శక్తి మహిళల్లో పెరిగిందని తెలిపారు. భవిష్యత్తులో మహిళా సాధికారత కోసం తమ ప్రభుత్వం చేపట్టబోయే ప్రణాళికలను ఆవిష్కరించారు. మహిళా శక్తి తోడుగా 2047 నాటికి తెలంగాణ త్రీ ట్రిలియన్ డాలర్ల లక్ష్యాన్ని చేరుకుంటుందని తెలిపారు. పెట్టుబడిదారులు, జాతీయ మరియు అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు తెలంగాణలో మహిళా ఆధారిత అభివృద్ధి అవకాశాలను పరిశీలించాలని పిలుపునిచ్చారు.



గ్లోబల్ సమ్మిట్‌లో హైడ్రా, డీఆర్ ఎఫ్ సేవలపై ఆరా

- హైడ్రా సేవలను పరిశీలించిన సందర్శకులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 8: గ్లోబల్ సమ్మిట్ లో వివిధ ప్రభుత్వ విభాగాలతో కలిసి ఏర్పాటు చేసిన హైడ్రా స్టాల్ అందరినీ ఆకట్టుకుంటోంది. హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు సేవలు అందరి మన్ననలూ పొందుతున్నాయి. రాత్రి, పగలూ అనే తేడా లేకుండా.. వర్షం పడిన సమయంలో రహదారులపైన, నీట మునిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు చేసిన సేవలను ఆసక్తిగా అడిగి తెలుసుకుంటున్నారు. సమస్య తలెత్తకుండా తీసుకున్న చర్యల వీడియోలను ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్టాల్‌ను సందర్శించి ప్రతినిధులతో చర్చించడం.. సమస్య పరిష్కారంలో నిపుణుల సలహాలను స్వీకరించారు. మొదటి ఏడాదిలోనే హైడ్రా మంచి ఫలితాలు సాధించింది. భారీ వర్షాలు పడినా.. నగరంలో ఎక్కడా వరద ముప్పు లేకుండా జాగ్రత్తలు తీసుకుంది. ఆక్రమణలను తొలగించి నాలాలను విస్తరించింది. దీంతో అమీర్‌పేట, సికింద్రాబాద్ ప్యాట్నీ ప్రాంతాల్లో లక్షలాదిమందికి ముంపు సమస్యను తప్పించింది. హైదరాబాద్ నగరం ఎంతో భద్రమో.. హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్(డీఆర్ ఎఫ్) టీమ్‌ల పని తీరును వివరిస్తూ రూపొందించిన వీడియో ప్రదర్శన గ్లోబల్ సమ్మిట్‌కు వచ్చిన వారిని ఆకట్టుకుంటోంది

గ్లోబల్ సమ్మిట్ సక్సెస్‌ను ఓర్చుకోలేకపోతున్నారు

- బీఆర్ఎస్.. గోబెల్స్ రాష్ట్ర సమితిగా మారింది
- హరీష్ రావు చేసిన వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఫైర్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్8: గ్లోబల్ సమ్మిట్ సక్సెస్‌ను హరీష్ రావు ఓర్చుకోలేకపోతున్నారని మంత్రి సీతక్క అన్నారు. గ్లోబల్‌సమ్మిట్‌పై మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలపై మంత్రి సీతక్క మండిపడ్డారు. లక్షల కోట్ల పెట్టుబడులు వస్తుంటే సహించలేకపోతున్నారని అన్నారు. కళ్ళల్లో నిప్పులు పోసుకొని తెలంగాణ ఆగం కావాలని కోరుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు ప్రచారంతో బీఆర్ఎస్.. గోబెల్స్ రాష్ట్ర సమితిగా మారిందని, కేసీఆర్ కుటుంబమే గొప్పదన్న అహంకారంతో హరీష్‌రావు మాట్లాడుతున్నారని మంత్రి అన్నారు. విజనరీ ఉన్న నేతలను చులకన చేసి మాట్లాడటం హరీష్‌రావు నైజం అని, ఖరీదైన భూములను పప్పు బెల్లాలకు అమ్ముకున్న చరిత్ర బీఆర్ఎస్ పెద్దలదని అన్నారు. గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకే సమ్మిట్ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇక్కడ దేశ విదేశాల కంపెనీలు వచ్చి పెట్టుబడులు పెట్టేందుకు వేల కొలది ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఒప్పందాలు చేసుకుంటున్నాయని అన్నారు. నిరుద్యోగులను సొంత అవసరాలకు వాడుకొని కేసీఆర్ కుటుంబం వదిలేసిందని, కానీ మేము ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తూనే, ప్రైవేటు రంగంలో కూడా ఉద్యోగ కల్పన చేస్తున్నామని అన్నారు. దావోస్ సమ్మిట్ ను వినడమే కానీ నేను చూడలేదని, కానీ భారత్ ఫ్యూచర్ సిటీలో దావోసు సమ్మిట్‌కు మించి సదస్సును నిర్వహిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు.

మేడ్చల్–మల్కాజ్‌గిరిలో అభివృద్ధి శూన్యం

- 32 లక్షల జనాభా ఉన్నా సరైన ఆస్పత్రి లేదు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపాటు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 8: "మేడ్చల్-మల్కాజ్‌గిరిలో అభివృద్ధి శూన్యం.. కబ్జాలు, ప్రైవేటీకరణ, నిర్లక్ష్యం మాత్రమే కనిపిస్తోంది" అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండి పడ్డారు. జనంబాట కార్యక్రమంలో భాగంగా ఆమె మేడ్చల్-మల్కాజ్‌గిరి పార్లమెంటు పరిధిలో పర్యటించారు. ఉప్పల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, మేడ్చల్, కూకట్‌పల్లి ప్రాంతాల్లో స్థానిక ప్రజలను కలిసి, సమస్యలను పరిశీలించిన ఆమె ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఈ ప్రాంతం "హైదరాబాద్‌కు కామధేనువుగా మారినా, అభివృద్ధి మాత్రం ఎక్కడా కనిపించడం లేద"ని అన్నారు. ప్రభుత్వం కూకట్‌పల్లిలో రూ. 2,000 కోట్ల విలువైన భూములను అమ్ముకున్నా, స్థానిక ప్రజల అభివృద్ధి కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. జేఎన్టీయూ మెట్రో స్టేషన్ వద్ద తీవ్ర ట్రాఫిక్ సమస్య, స్టేడియం లేకపోవడం, స్కూలు-రోడ్ల వంటి మౌలిక వసతుల లోపం గురించి కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. తదుపరి పర్యటనలో మేడ్చల్ జిల్లాను సందర్శించిన కవిత, అక్కడ పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నాయని పేర్కొన్నారు. 32 లక్షల జనాభా ఉన్న జిల్లాలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి కూడా లేకపోవడం ఆశ్చర్యకరమని అన్నారు. సిజేరియన్, అత్యవసర సేవల కోసం ప్రజలు గాంధీ ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోందని, ఇది ప్రజల ప్రాణాలకు ప్రమాదమని అన్నారు. ఎడ్యుకేషన్, హెల్త్ పూర్తిగా ప్రైవేటు రంగం ఆధీనంలోకి వెళ్లిపోయాయని, వేలాది మంది విద్యార్థులు చదువుతున్నా సరిపోయే బస్సు సర్వీసులు కూడా లేవని కవిత వివరించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్, కాలుష్యం, రోడ్ల దుస్థితి, చెరువుల కబ్జాలు, నీటి సమస్యలు-ఇలా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన సమస్యలు కనిపిస్తున్నాయని చెప్పారు.

కబ్జాలకు పెద్ద ఎత్తున అండ...

కుత్బుల్లాపూర్‌ను ప్రజలు "కబ్జాలపూర్" అని పిలుస్తున్నారని కవిత విమర్శించారు. అధికారపక్ష నేతలు, స్థానిక ప్రభావశీలులు చెరువులను, ప్రభుత్వ భూములను విస్తృతంగా ఆక్రమించుకుంటున్నారని ఆమె ఆరోపించారు. బండ్ల చెరువు, పరికి చెరువు, లింగం చెరువు వంటి అనేక చెరువులు నిర్మూలన అంచుకు చేరాయని, అధికారుల నిర్లక్ష్యం స్పష్టమైందని పేర్కొన్నారు. జవహర్‌నగర్‌లో పేదలకు ఇళ్లు ఇచ్చి, చెత్త కుప్ప మధ్యలోకి నెట్టేశారు అని, అక్కడ ఏర్పాటు చేసిన ఎస్టీపీని పేదలే నిర్వహించాలంటూ నెలకు లక్షల్లో ఖర్చు పడే బాధ్యతను మోపటం మానవత్వమే కాదని కవిత అన్నారు. భూదేవి నగర్, నందమూరి కాలనీ వంటి ప్రాంతాల్లో టాయిలెట్లు, డ్రైనేజ్ వంటి కనీస సదుపాయాలు కూడా లేకుండా ప్రజలు అవస్థలు పడుతున్నారని, దయనీయ పరిస్థితి చూసి ఆందోళన చెందాల్సి వచ్చిందని ఆమె చెప్పారు.

ఉప్పల్ ఫ్లైఓవర్ ఏళ్ళుగా పూర్తి కాలేదు

ఉప్పల్ ఫ్లైఓవర్ నిర్మాణం ఎన్నేళ్లుగా సాగుతూనే ఉందని, కూర్మనగర్‌లో ఎస్టీపీ వ్యతిరేకంగా నిరసన తెలిపిన మహిళలను పోలీసులు తీవ్రంగా అవమానించటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద 15 ఎకరాల హుడా భూమిని ప్రభుత్వం వేలం వేయాలని చూస్తోందని, దాన్ని తక్షణం ఆపాలని కవిత డిమాండ్ చేశారు. అంత పెద్ద హౌసింగ్ బోర్డు కాలనీ ఉన్న కూకట్‌పల్లికి స్టేడియం కూడా లేకపోవడం విచిత్రమని అన్నారు. లక్ష్మాపూర్ భూ సర్వేలో జరిగిన అన్యాయాలను కవిత ప్రస్తావించారు. ధరణి ద్వారా భూములను తప్పుగా కొలవడం వల్ల రైతులకు రావాల్సిన రైతు బంధు నిధులు కూడా తగ్గిపోయాయని ఆమె అన్నారు. రేవంత్ రెడ్డి ఎంపీగా ఉన్నప్పుడే సమస్యలు తెలుసుకున్నారని, ఇప్పుడు సీఎం అయినా కూడా పరిష్కారం కనిపించకపోవడం బాధాకరమన్నారు.

బీసీలకు కాంగ్రెస్–బీజేపీ రెండు ద్రోహం చేశాయి

బీసీ రిజర్వేషన్ల విషయంపై కూడా కవిత మండిపడ్డారు. సర్పంచ్ ఎన్నికల రోజునే అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరీక్ష పెట్టడం తప్పని, దాన్ని వాయిదా వేయాలని అన్నారు. గ్లోబల్ రైజింగ్ సిటీ అని చెప్పుకుంటున్న హైదరాబాద్ పరిసరాల్లో ఈ స్థాయి పేదరికం, దారుణ పరిస్థితులు ఉండటం ప్రభుత్వం వైఫల్యమేనని కవిత పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని, ప్రతి నియోజకవర్గంలో కమిటీలు ఏర్పాటు చేసి సమస్యలపై ఫాలోఅప్ చేస్తామని హామీ ఇచ్చారు.



తెలంగాణ ఆగ్రోస్ భూమిని కాపాడిన హైడ్రా

- కబ్జాలకు ఆస్కారం లేకుండా కంచె నిర్మాణం
- ప్రహరీలు నిర్మించి షెడ్డులు వేసి ఆక్రమణలు
- కిరాయిలకు ఇచ్చుకుంటూ రూ. లక్షల్లో వసూళ్లు

ప్రతిపక్షం, సిటి బ్యూరో, డిసెంబర్ 8: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ మండలంలోని మౌలాలి నాచారం విలేజ్లోని తెలంగాణ ఆగ్రోస్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ భూములను హైడ్రా కాపాడింది. సర్వే నంబరు 29/1 తో పాటు 30లలో 23.28 ఎకరాలను తెలంగాణ ఆగ్రోస్కు రాష్ట్ర ప్రభుత్వం గతంలో కేటాయించింది. అయితే ఈ భూమికు ఆనుకుని ఉన్న దుర్గానగర్, కమలాబాయ్ నగర్, బాబానగర్ కాలనీలవైపు కొంతమేర ఆక్రమణలు జరిగాయి. ఇలా ఇప్పటికే 4 ఎకరాలు కబ్జాకు గురయ్యింది. ఇలా వరుసగా కబ్జాలు జరుగుతున్నాయని వెంటనే కబ్జాలను తొలగించి ఆగ్రోస్ భూమిని కాపాడాలంటూ తెలంగాణ ఆగ్రోస్ సంస్థ చైర్మెన్ కాసుల బాలరాజు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలమేరకు హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే ఇళ్లు కట్టుకుని నివాసం ఉన్న వాటిని మినహాయించారు. వాటి జోలికి వెళ్లకుండా.. ప్రీకాస్ట్ ఇటుకలతో ప్రహరీ నిర్మించి.. అందులో వేసిన చిన్న షెడ్డులను తొలగించారు. సేకరించిన చెత్తను వేరు చేసేందుకు వినియోగిస్తున్న షెడ్డులను, స్క్రాప్ దుకాణాన్ని ఖాళీ చేయించి వాటిని హైడ్రా తొలగించింది.

ఇప్పటికే పలు కేసులు..

ఇక్కడ లావణ్య అనే మహిళ తప్పుడు పత్రాలతో రెండు ఎకరాలకు పైగా చిన్న ప్లాట్లుగా చేసి అమ్మేయగా.. తెలంగాణ ఆగ్రోస్ వారు ఆమెపై నాచారం పోలీసు స్టేషన్లో కేసులు పెట్టారు. తెలంగాణ ఆగ్రోస్లోనే పని చేస్తున్న ఉద్యోగి రాజు అనే వ్యక్తితో కలిసి 1200 గజాల ఆక్రమణలో భాగస్వామ్యం అయినట్టు ఆ సంస్థ అధికారులు తెలిపారు. అలాగే.. మహేందర్ అనే వ్యక్తి 2 వేల గజాలకు పైగా ఆక్రమమించి ప్లాట్లుగా విడదీసి.. ప్రస్తుతానికి చిన్న షెడ్డులు వేసి వాటిని కిరాయికి ఇచ్చినట్టు ఆగ్రోస్ అధికారులు ఫిర్యాదు చేశారు. వీరందరికీ ఇప్పటికే నోటీసులు ఇచ్చామని చెప్పారు. ఇలా వివిధ కట్టడాలతో ఆక్రమణలకు పాల్పడితే.. వాటిని తొలగించి.. తెలంగాణ ఆగ్రోస్కు చెందిన భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. మల్లాపూర్ డివిజన్లో ఎక్కడా నివాసాల జోలికి వెళ్లలేదని హైడ్రా స్పష్టం చేసింది.

"



భారత్‌లో విమాన సర్వీసులకు డిమాండ్ పెరుగుతోంది. డిమాండ్‌కు తగినట్టుగా కాంపిటీటర్స్ ఉండాలి. దేశంలో మరో 5 పెద్ద విమాన సంస్థల అవసరం ఉంది. ఏవియేషన్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టేవారికి ప్రభుత్వం సహకారం అందిస్తుంది. ఇండిగో సంక్షోభంపై చర్యలు తీసుకోవడంతోపాటు దానిని ఒక ఉదాహరణగా తీసుకుంటాం.

\- సివిల్ ఏవియేషన్ మినిస్టర్ రామ్మోహన్ నాయుడు

ఓపెన్ వాయిస్

జాతీయ రహదారులకు రాజ'కళ'

తెలంగాణలో రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు కీలకమైన హైదరాబాద్-విజయవాడ నేషనల్ హైవే ను ఎనిమిది లైన్ల రహదారిగా విస్తరించేందుకు తగిన ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ భారీ ప్రాజెక్టు అంచనా వ్యయం సుమారు రూ. 10,400కోట్లుగా ఉంది. ప్రస్తుతం దీనికి సంబంధించి డీపీఆర్ తయారీ జరుగుతోంది. ఈ డీపీఆర్ ఖరారైన తర్వాత నిధులు మంజూరై, నిర్మాణ పనులు వేగవంతం అవుతాయి. ఈ విస్తరణతో రెండు రాష్ట్రాల మధ్య ప్రయాణ సమయం తగ్గి, ట్రాఫిక్ రద్దీ సమస్య తీరుతుందని వాణిజ్య సంబంధాలు మెరుగుపడతాయని అధికారులు భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర రహదారుల రంగంలో సరికొత్త శకం మొదలుకానుంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిని తెలంగాణ రాజధాని హైదరాబాద్‌ను కలిపే కీలక 'జాతీయ రహదారి 65 (ఎన్ హెచ్ 65)'పై భారీ ప్రాజెక్టుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. రవాణా రంగానికి జీవనాడిగా భావించే హైదరాబాద్ విజయవాడ నేషనల్ హైవేను ఏకంగా ఎనిమిది వరుసల రహదారిగా విస్తరించనున్నారు. ఈ మెగా ప్రాజెక్టు అంచనా వ్యయం దాదాపు రూ. 10,400 కోట్లుగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం నాలుగు వరసలుగానే ఉన్న ఈ రహదారిని ఎనిమిది లైన్ల వరకు విస్తరించడం ద్వారా ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. అంతేకాక, ఈ మార్గంలో తరచూ ఎదురయ్యే ట్రాఫిక్ రద్దీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుతం వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక సిద్ధమవుతోంది. డీపీఆర్ ఖరారు అయిన వెంటనే.. జాతీయ రహదారుల సంస్థ (ఎన్ హెచ్ ఏఐ) లేదా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధుల మంజూరు చేయడంతో సాంకేతిక ఆమోదం లభిస్తుంది. సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే ప్రాజెక్టును టెండరింగ్ ప్రక్రియ ద్వారా నిర్మాణ సంస్థలకు అప్పగిస్తారు. ఆ తర్వాత.. భూసేకరణ వంటి అంశాలను పూర్తి చేసి యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు మొదలుపెట్టనున్నారు. ఇదిలా ఉండగా, తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ నూతన ప్రాజెక్టుల నిర్మాణంలో రికార్డులను సృష్టిస్తూ వేగంగా దూసుకుపోతోంది. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలనూ రాజధాని హైదరాబాద్‌తో అనుసంధానించాలనే లక్ష్యంతో కొత్త జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల నిర్మాణాలను, ఉన్న రహదారుల విస్తరణ పనులను వేగవంతం చేస్తున్నారు. హైదరాబాద్ విజయవాడ కారిడార్ విస్తరణతో ఈ మార్గంలో పరిశ్రమలు, లాజిస్టిక్స్ హబ్‌లు, ఇతర వ్యాపార కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉంది. ఇది రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ఉపాధి అవకాశాల కల్పనకు దోహదపడుతుంది.ఎనిమిది లైన్ల రహదారి వలన హైదరాబాద్ నుండి విజయవాడకు ప్రయాణించే ప్యాసింజర్ వాహనదారులు, అలాగే, వస్తు రవాణా చేసే లారీలు వేగంగా.. సురక్షితంగా గమ్యస్థానాన్ని చేరుకోగలుగుతారు. తద్వారా, ఇరు రాష్ట్రాల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత మెరుగుపడతాయి.

ప్రతిపక్షం

హైదరాబాద్,

మంగళవారం
09.12.2025

చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన ఉద్యమ జ్వాల

'కేసీఆర్ అంటే తెలంగాణ, తెలంగాణ అంటే కేసీఆర్' అనే వాస్తవాన్ని ప్రజలు నిర్మించారు. ఈ భూమి, ఈ నీళ్లు, ఈ ప్రజలు ఆయనపై నమ్మకం ఉంచినప్పుడు, ఆయన కూడా ఆ నమ్మకాన్ని అభివృద్ధి, సంక్షేమం, సమగ్రత రూపంలో నిలబెట్టారు. ప్రస్తుతం రాజకీయ పరిస్థితులు ఏ రూపంలో ఎలా ఉన్నా, తెలంగాణ ఉద్యమ చరిత్రలో కేసీఆర్ పేరును చెరిపేయలేరు. మలిదశ ఉద్యమానికి సారథి, త్యాగానికి ప్రతీక, పోరాటానికి ప్రతిష్ట. కేసీఆర్ నిలిచిన స్థానం ప్రత్యేకం. అమరుల త్యాగం అమరం – తెలంగాణ గుండెలపై చెక్కిన అక్షరాలు. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులకు వందనాలు. మీ త్యాగమే నేటి తెలంగాణ. మీరు వెలిగించిన జ్యోతి ఎప్పటికీ ఆరదు. తెలంగాణ అమరులకే తొలి వందనం. జోహార్లు జోహార్లు.



చిటుకుల మైసారెడ్డి
9490524724

అరవై యేండ్లుగా అణగారిన తెలంగాణ భూమి, ఉమ్మడి పాలనలో ఎదురైన అన్యాయం, వివక్షకు గురైన ప్రజల ఆవేదన, ఇవన్నీ దట్టమైన మేఘాల్లా చేరి చివరకు ఒక మహా ఉద్యమ తుపానుగా మారాయి. సాగునీటి కోసం ఎదురు చూసిన రైతులు కళ్ల ముందే పంటలు ఎండిపోతే చేసిన ఆత్మహత్యలు, చెరువులు ఎండిపోయి బోర్లు పాతాళానికి దిగిపోయిన దుస్థితి, ఉపాధి లేక ఆకలితో విలవిలలాడిన పల్లెబస్తీలు, ఇవన్నీ తెలంగాణ ప్రాంతం ఎదుర్కొన్న చేదు వాస్తవాలు. ఉమ్మడి పాలనలో ప్రాజెక్టులన్నీ ఆంధ్ర వైపు మళ్లించగా, తెలంగాణ రైతు కరువుతో, కరెంట్ కోతలతో, పాముకాట్లతో, నిత్య జీవిత పోరాటాలతో అలమటించింది. ఇదే సమయంలో 'మన నీళ్లు మనకు, మన ఉద్యోగాలు మనకే' అని తెలంగాణ ప్రజల హృదయంలో జ్వాలలు రగులాయి. ఆ భావానికి రూపం ఇచ్చినవారు కల్వకుంట్ల చంద్రశేఖరరావు, కేసీఆర్. పల్లెలలోనూ, పట్టణాలలోనూ గులాబీ జెండాను పాతి, ఉద్యమాన్ని ప్రజా ప్రళయంలా మార్చి, తెలంగాణ కోసం ప్రాణత్యాగానికి సిద్ధమై అడుగులు వేసిన నేత కేసీఆర్. ఆయనకు సిద్దిపేట ఇచ్చిన సద్దిమూట, తెలంగాణ ప్రజల ఆశీస్సులు ఉద్యమానికి పరిణామం మార్చే శక్తిని అందించాయి.

ఆమరణ దీక్ష – తెలంగాణ ఉద్యమానికి మలుపు

2009 నవంబర్ 29న 'తెలంగాణ వచ్చుడో, కేసీఆర్ చచ్చుడో' అనే నినాదంతో ఆయన ఆమరణ దీక్షకు కూర్చున్న క్షణం నుంచి తెలంగాణ అటు అగ్నిగుండంగా మారింది. కరీంనగర్‌లో అరెస్టు చేసి ఖమ్మం జైలుకు తరలించినా, జైలునే దీక్షాస్థలంగా మార్చి కేసీఆర్ తలపెట్టిన సంకల్పం మరింత బలమైంది. దీక్షతో తెలంగాణవ్యాప్తంగా అశాంతి రగిలి, భగ్గుమన్న జ్వాలలు ఊచకోత పద్దాయి. అందోళనలు, సమర శంఖారావాలు, ఆత్మాహుతులు అన్ని కలసి ఉద్యమానికి ఉగ్రరూపం తెచ్చాయి. శ్రీకాంతాచారి సహా ఎన్నో మంది అమరుల త్యాగాలు ఉద్యమానికి శక్తి నింపాయి. కేసీఆర్ ఆరోగ్యం క్షీణించి నిమ్స్ చేరినప్పటికీ, ఆయన సంకల్పం మాత్రం కొరవడలేదు. చివరికి కేంద్రం వెనక్కి తగ్గి డిసెంబర్ 9న తెలంగాణపై అనుకూల ప్రకటన చేయక తప్పలేదు. పద్నాలుగేండ్ల సుదీర్ఘ పోరాటం, వేలాది యువత బలిదానాలు, సకలజనుల సమ్మెలు, మిలియన్



మార్చ్ లాంటి మహా ప్రజా ఉద్ధృతికి ప్రతిఫలంగా 2014 జూన్ 2న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించింది. తొలిముఖ్యమంత్రిగా కేసీఆర్ కేవలం పాలనకే కాకుండా తెలంగాణ పునర్నిర్మాణానికి ఉద్యమ శైలినే అనుసరించారు.

సాగు నీటిని పంటపొలాలకు చేర్చడం

కాళేశ్వరం ద్వారా సాగు నీటిని పంటపొలాలకు చేర్చడం, మొదటిసారిగా రైతుబంధు, రైతుబీమా వంటి రైతు సంక్షేమ పథకాలు, ఉచిత సాగు కరెంటు, ఇవన్నీ తెలంగాణను దేశంలోనే ప్రత్యేకంగా నిలబెట్టాయి. కల్యాణలక్ష్మి, ఆసరా, దళితబంధు వంటి పథకాలు సామాజిక న్యాయాన్ని స్థాపించాయి. అభివృద్ధి పరంగా తెలంగాణ దేశానికి ఆదర్శ రాష్ట్రంగా నిలిచింది. తెలంగాణ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల జ్ఞాపకార్థం హుస్సేన్ సాగర్ తీరాన అమరజ్యోతి నిర్మించి కేసీఆర్ ప్రభుత్వం తన ఘన కర్తవ్యాన్ని నిర్వర్తించింది. మలిదశ ఉద్యమంలో శ్రీకాంతాచారి నుంచి పోలీస్ కిష్టయ్య, వేణుగోపాల్ రెడ్డి, యాదిరెడ్డి, సువర్ణ, యాదయ్య, పావని వరకు, అటు జర్నలిస్టులు వల్లకొండ లక్ష్మారెడ్డి నుంచి సునీల్ వరకు, ఎందరో యువజీవితాలు తెలంగాణ కోసం అర్పించబడ్డాయి. వారి త్యాగమే తెలంగాణ రాష్ట్రానికి పునాది. అమరుల కుటుంబాల కోసం ఆర్థిక సహాయాలు, ఉద్యోగాలు, వార్షిక సన్మానాలు చేపట్టడం ప్రభుత్వ బాధ్యతగా మార్చుకున్నారు. అమరుల ఆకాంక్షలకు తగ్గట్టే సాగునీటి విప్లవం, సంక్షేమ రాష్ట్రం, ఐటి ఉద్యోగావకాశాలు, అంబేద్కర్ సచివాలయం వంటి ఆత్మగౌరవ చిహ్నాలు అవతరించాయి.

కేసీఆర్ – ఉద్యమానికి ప్రతీక, తెలంగాణకు రక్ష

'కేసీఆర్ అంటే తెలంగాణ, తెలంగాణ అంటే కేసీఆర్' అనే వాస్తవాన్ని ప్రజలు నిర్మించారు. ఈ భూమి, ఈ నీళ్లు, ఈ ప్రజలు ఆయనపై నమ్మకం ఉంచినప్పుడు, ఆయన కూడా ఆ నమ్మకాన్ని అభివృద్ధి, సంక్షేమం, సమగ్రత రూపంలో నిలబెట్టారు. ప్రస్తుతం రాజకీయ పరిస్థితులు ఏ రూపంలో ఎలా ఉన్నా, తెలంగాణ ఉద్యమ చరిత్రలో కేసీఆర్ పేరును చెరిపేయలేరు. మలిదశ ఉద్యమానికి సారథి, త్యాగానికి ప్రతీక, పోరాటానికి ప్రతిష్ట. కేసీఆర్ నిలిచిన స్థానం ప్రత్యేకం. అమరుల త్యాగం అమరం - తెలంగాణ గుండెలపై చెక్కిన అక్షరాలు. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులకు వందనాలు. మీ త్యాగమే నేటి తెలంగాణ. మీరు వెలిగించిన జ్యోతి ఎప్పటికీ ఆరదు. తెలంగాణ అమరులకే తొలి వందనం. జోహార్లు జోహార్లు.

(వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్)

అవినీతి భూతం, అభివృద్ధికి శరాఘాతం



సుధాకర్ ఏవీ
9000674747

ఏడు దశాబ్దాలుగా దేశంలో అవినీతి అత్యధికంగా చర్చకు తావిచ్చిన అంశంగా పేర్కొనవచ్చు. అయినప్పటికీ, మనం అవినీతి నిర్మూలనలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోతున్నాము. రాను రాను అవినీతి తన రూపురేఖలను మార్చుకుంటూనే ఉంది. దానిని నిర్వహించాలంటే కొత్త పరిమితులను ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి. జనాభా పెరుగుదలతో సమానంగా అవినీతి బాధితుల సంఖ్య, అవినీతిపరుల సంఖ్య కూడా పెరుగుతోంది. మన దేశంలో అవినీతి అంటే లంచం తీసుకోవడం ఒక్కటేనన్న భావన అందరిలో ఉన్నది. కానీ, ప్రతి వ్యక్తి తమ విధులను సక్రమంగా నిర్వర్తించలేకపోవడం. సమయానికి విధులకు హాజరు కాకపోవడం, సమయానికన్నా ముందే తన విధుల నుండి నిష్క్రమించడం, ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడం,విద్యుత్ ను అక్రమంగా వాడటం, ఇంటిలో విద్యుత్ మీటర్ ను చట్ట వ్యతిరేక పద్ధతులలో తిరగకుండా చేసి బిల్లు ఎగ్గొట్టడం, బస్సులు, రైళ్లలో టికెట్ లేకుండా ప్రయాణించడం, క్యూ లైన్ లలో ఇతరులను దాటి ముందుకెళ్లడం. మన ఇంటిలో నుండి మురుగు నీటిని వీధులలోకి వదలడం. రోడ్లపై వేదికలు ఏర్పాటు చేసి ఇతరులకు ఆటంకం కలిగించడం వంటివన్నీ అవినీతి కిందికే వస్తాయి.

హేళన చేసేవారే ఎక్కువగా ఉండటం

నిజాయితీపరులకు మద్దతునిచ్చే వారికన్నా వారిని హేళన చేసేవారే ఎక్కువగా ఉండటం విడ్డూరం. అవినీతిని దగ్గరకు రానియ్యనివారిని, డ్యూటీలో నిజాయితీగా ఉండేవారిని 'వాడు తినడు మనని తిననీయడు, ప్రపంచంలో వీడొక్కడే సత్య హరిశ్చంద్రుడు అన్నట్లుగా వ్యవహరిస్తున్నాడు' అనే మాటలు, సన్నివేశాలు తరచూ మనకు తారసపడుతూనే ఉంటాయి. అదే అవినీతి వల్ల వారికి నష్టం జరిగితే కారకులను తిట్టిపోస్తాం. ప్రభుత్వ విధానాలను రాజకీయ పార్టీల నేతలు వారి వారి అనుచరులకు అనుగుణంగా తయారు చేయడం రాజకీయ అవినీతి క్రిందకు వస్తుంది. ఒక వర్గం వారికి మేలు చేసేలా నిర్ణయాలు తీసుకోవడం, అవినీతి వ్యతిరేక విభాగాల పని తీరును మెరుగుపరచుకోక పోవడం ప్రభుత్వ విధానపరమైన అవినీతి క్రిందకు వస్తుంది. న్యాయం జరగాల్సిన వారి తరపు న్యాయవాదులు ప్రతివాదులతో కుమ్మక్కై కక్షిదారులకు అన్యాయం చేయడం న్యాయ అవినీతి క్రిందకు వస్తుంది. వీటన్నింటినీ సంఘటిత రంగ అవినీతి పరిధిలో ఉంటాయి. ప్రజల నుంచి ప్రభుత్వానికి చెల్లించాల్సిన



దానిలో జరిగే అవినీతి, ప్రజల మధ్య జరిగే కార్యకలాపాలలో అవినీతి, పన్నుల చెల్లింపులో అవినీతి, ధాన్యం లేదా ఇతర వస్తువుల కొరత సృష్టించడం, బ్రాండెడ్ వస్తువుల మాదిరిగా నాణ్యత లేని చౌక వస్తువులను సృష్టించడం, తూకాలలో మోసాలు, నాసిరకం పనులు, లేని బిల్లులు తీసుకోవడం, మరమ్మతుల పేరుతో చేసిన పనినే మళ్లీ చేసి బిల్లులు తీసుకోవడం ఇలాంటి పనులన్నీ అసంఘటిత అవినీతి పరిధిలోకి వస్తాయి.

అవినీతికి కూడా కారణాలు అనేకం

'కర్ణుడి చావుకి అనేక కారణాలు' అన్నట్లుగా అవినీతికి కూడా కారణాలు అనేకం. డబ్బుతో సమస్తం నడుస్తుందనే భావన, వ్యవస్థ పట్ల మనకున్న చులకన భావం, సమాజంలో ధనవంతులు అనుభవిస్తున్న సౌఖ్యాలను రాత్రికి రాత్రే అందిపుచ్చుకోవాలన్న దురాశ, సామాజిక అవగాహన లేమి తదితర అంశాలన్నీ అవినీతికి కారణమవుతాయి. అవినీతి నిర్మూలనకు సమగ్ర వ్యవస్థ లేకపోవడం, సమాజంలో అవినీతిపరులే అందలం ఎక్కడం, నిజాయితీపరులకు విలువ లేకపోవడం, సమాజంలో పేదవారి ఆర్థిక స్థితిగతులు మారకపోవడం వంటి విషయాలన్నీ అవినీతికి కారణాలుగా చెప్పుకోవచ్చు. అవినీతి కారణంగా పేద ప్రజల జీవన ప్రమాణాలు మరింతగా దిగజారుతాయి. దారిద్ర్యం, వివిధ రంగాల్లో అస్థిరత పెరిగిపోతాయి. అంతిమంగా అది మౌలిక వసతుల వైఫల్యానికి, రాజ్య వైఫల్యానికి దారి తీస్తుంది. ప్రభుత్వాలు, ప్రయివేటు సంస్థలు, ఎన్జీవోలు, మీడియా, వ్యక్తులు కలసికట్టుగా అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పాలుపంచుకోవాల్సి ఉంది. అవినీతితో మానవ హక్కుల ఉల్లంఘనలు, మార్కెట్ అనిశ్చితి, జీవన ప్రమాణాల నాణ్యంలో క్షీణత లాంటివి చోటు చేసుకుంటాయి. వ్యవస్థీకృత నేరాలు పెరిగిపోతాయి.

నిర్మూలించడం కష్టమేమీ కాదు

2025 కు సంబంధించిన ప్రపంచ అవినీతి సూచీ ప్రకారం,భారత్ 180 దేశాలలో 96వ స్థానంలో ఉంది.ఈ సూచీని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ విడుదల చేస్తుంది. ఇందులో అవినీతి స్థాయిని 0 నుండి 100 పాయింట్ల మధ్య లెక్కిస్తారు. భారత్‌కు 38 పాయింట్లు లభించాయి, ఇది 2022లోని 40 పాయింట్ల కంటే తక్కువగా ఉంది. అవినీతి రహిత దేశాలలో డెన్మార్క్ మొదటి స్థానంలో ఉండగా, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో న్యూజీలాండ్ మూడవ స్థానం, సింగపూర్ ఐదవ స్థానంలో నిలిచాయి. మానవ జీవితాన్ని అవినీతి ఏ విధంగా ప్రభావితం చేస్తుందో తెలుసుకుంటే దానిని నిర్మూలించడం కష్టమేమీ కాదు. ప్రజలందరినీ భాగస్వాములను చేసే సోషల్ ఆడిట్ ప్రక్రియను మరింతగా విస్తృతం చేయాలి. అన్ని విభాగాలలో ఆడిట్ నిర్వహించాలి. సమాచార హక్కు చట్టం మీద ప్రజలందరికీ అవగాహన కల్పించాలి. ప్రతి ఒక్కరూ చట్టాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలి. దేశమంతా వర్తించేలా అవినీతి కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలి. అవినీతిపై పోరాడడానికి న్యాయ వ్యవస్థను సరళతరం చేయాలి. అవినీతి నిరూపించబడితే శిక్షలు కఠినంగా ఉండాలి. రాజకీయ నాయకులైతే ఎన్నికలకు అనర్హులుగా ప్రకటించాలి. అలాగే, నిజాయితీపరులను ప్రోత్సహించే కార్యక్రమాలు చేపట్టాలి. అవినీతిలో ప్రధానంగా చెప్పే లంచం ఇవ్వడం తీసుకోవడం రెండు చట్టరీత్యా నేరం. లంచాన్ని సాధారణంగా ప్రభుత్వ అధికారులను ఒప్పించి తప్పుడు పనులు చేయడానికి ఇస్తారు. ఇది డబ్బుల రూపంలో గానీ, బహుమతుల రూపంలో గానీ ఉండవచ్చు.

(నేడు అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం)

(-వ్యాస రచయిత స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ అసోసియేట్ అధ్యక్షుడు)

రక్తబంధాలపై మత్తు దాడి




వెంకగారి భూమయ్య
9848559863

ప్రతి ఇంటికి ఒక కల ఉంటుంది. తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రయోజకులవ్వాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నిరంతరం శ్రమిస్తారు. చదువులో చురుకుగా ఉన్న బిడ్డలను చూసి ఆనందించని అమ్మానాన్న ఉండరు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుంటే ఉపాధ్యాయులు గర్వపడతారు. కానీ, నేడు ఈ సంతోషం ఆవిరైపోతోంది. అనేక కుటుంబాలలో ఈ ఆశలు, కలలు గంజాయి, మాదక ద్రవ్యాల (డ్రగ్స్) రూపంలో వికటాట్టహాసం చేస్తున్న వ్యసనం కారణంగా ఛిన్నాభిన్నమవుతున్నాయి. ఇది కేవలం మనిషిని కాదు, అతని గుణాన్ని నిట్టనిలువునా చంపేస్తోంది, అతనితో ఉన్న ప్రతి సంబంధాన్ని నాశనం చేస్తోంది. ఈ వ్యసనం మొదట సరదాగా ప్రారంభమై, క్రమంగా ఆ కుటుంబాన్ని కల్లోలంలోకి నెడుతుంది. మత్తుకు బానిసైన కొడుకు ప్రవర్తనలో వచ్చే విపరీత మార్పులు, వికృత చేష్టలు చూసి తల్లి భయపడుతుంది. చిన్న చిన్న అవసరాల కోసం, చివరికి వ్యసనం కోసం డబ్బు కావాలని తెలిసి, నాన్న జేబులో డబ్బులు మాయం చేయడం, విలువైన వస్తువులు దొంగిలించడం ఆరంభమవుతుంది. ఈ నేరం క్రమంగా స్నేహితుల సెల్‌ఫోన్లు, అమ్మ నగలు, బైకులు దొంగిలించేంత వరకు వెళుతుంది. 'జేబులో పెట్టిన డబ్బులు తీసేస్తున్నది కన్న కొడుకే' అని తెలిసి తండ్రి గుండెలు పగిలేలా ఏడుస్తాడు. ఈ పరిస్థితి తల్లిదండ్రులకు కంటి నిండా నిద్రను దూరం చేస్తోంది. బిడ్డ భవిష్యత్తుపై భయం వారిని వెంటాడుతోంది.

అందమైన ప్రపంచం అదృశ్యం

కుటుంబంలో మునుపటి నవ్వులు, ఆటలు, సంతోషాలు పూర్తిగా మాయమై, మౌనం ఆవహిస్తుంది. భార్యాభర్తలు కన్న అందమైన ప్రపంచం అదృశ్యమవుతుంది. విద్యార్థులు తమ ఏకాగ్రతను, లక్ష్యాలను కోల్పోయి చదువులను అర్ధంతరంగా ముగిస్తున్నారు. ఉన్నతస్థాయి ప్రభుత్వ అధికారుల గారాల కొడుకులూ అత్యున్నత టెక్నాలజీ కాలేజీలలో చేరేందుకు తీవ్రంగా ప్రయత్నించినా, ఈ వ్యసనం కారణంగా వారి లక్ష్యం నీరుగారిపోతోంది. బెంగళూరులో మంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న యువకులు సైతం, కొవిడ్ వంటి విపత్కర పరిస్థితులలో ఇంటి వద్ద పనిచేసే అవకాశం ఉన్నా, వ్యసనాన్ని కొనసాగించడం కోసం ఇంటికి రాకుండా గదికే పరిమితమై మత్తులోనే



జోగుతున్నారు. ఈ దృశ్యాలు వారి తల్లిదండ్రులకు తీరని వేదన మిగిల్చాయి. తాడేపల్లి వంటి ప్రాంతాలలో జరిగిన విషాద సంఘటనలు, అంటే వ్యసనానికి అలవాటైన కొడుకు ప్రవర్తనతో కలత చెందిన తండ్రి మరణించడం, ఆ తరువాత కొడుకుని మార్చలేక తల్లి ఆత్మహత్య చేసుకోవడం, ఒక కుటుంబాన్ని ఈ మత్తు ఎంతలా ఛిన్నాభిన్నం చేస్తుందో తెలియజేస్తున్నాయి. అంతకుమించి, మత్తులో ఉన్న కొందరు పిల్లలు సమాజం సిగ్గుపడే దారుణాలకు పాల్పడుతున్నారు.

మనం ఎటు ప్రయాణిస్తున్నాం?

చివరికి, ఈ వ్యసనానికి బలవుతున్న కుటుంబాలను చూసినప్పుడు, ఒక భయంకరమైన అయోమయం చుట్టుముడుతుంది. ఈ మత్తు అనేది తమ బిడ్డలను తమ నుండే దూరం చేస్తోంది, వారి లక్ష్యాలను, ఆశలను దహించివేస్తోంది. ఒకప్పుడు చదువుల గురించి, ఉద్యోగాల గురించి కలలు కన్న సమాజం, నేడు కేవలం 'మా బిడ్డ బతికి ఉంటే చాలు' అనే స్థితికి చేరుకుంది. ఈ వ్యసనపు కోరలలో చిక్కుకున్న యువతను వెనక్కి తీసుకురావడానికి కఠిన చట్టాలు, పునరావాస కేంద్రాలు, కౌన్సిలింగ్, పోలీసుల కృషి అవసరం. ఎన్ని చేసినా, ఎన్ని జీవితాలు నాశనమైనా ఈ గంజాయి గ్రీన్‌హౌస్‌ల వికటాట్టహాసం ఆగుతుందా? కుటుంబ బంధాలు పూర్వ స్థితికి చేరుకోగలవా? ఈ సామాజిక విచ్ఛిన్నం ఆగి, తిరిగి మన పిల్లలు ఆనందంగా నవ్వే రోజు వస్తుందా? లేక ఈ మత్తు రక్కసి మన భవిష్యత్తును పూర్తిగా కబళించేస్తుందా? అనే భయంకర ప్రశ్న మిగులుతోంది.

(వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం




ప్రతిఘటన మన నినాదం.. పోరాటాల తీవ్రతను పెంచాలి

- **మహాసభల్లో కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన సీఐటీయూ అఖిలభారత ప్రధాన కార్యదర్శి తపన్ సేన్**



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 8: జిల్లా కేంద్రంలో సీఐటీయూ మహాసభలు ప్రారంభమయ్యాయి. సీఐటీయూ జెండాను మహాసభ చైర్మన్ చుక్క రాములు ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల స్థూపానికి పూలమాలలతో నివాళులర్పిస్తూ నినాదాలు చేశారు కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని సిఐటియు జిందాబాద్ అంటూ ప్రతినిధులు స్థూపానికి నివాళులర్పించారు అనంతరం హాల్లో జరిగిన ప్రతినిధుల మహాసభకు జాతీయ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు వివిధ జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులతో మహాసభ ప్రారంభమైంది సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు మహాసభ చైర్మన్ చుక్కారామలు. ప్రారంభ ఉపన్యాసం చేశారు. జిల్లాలో సిఐటియు ఆవిర్భావం పోరాటాలకు వివరించారు అనంతరం సిఐటియు అఖిలభారత జాతీయ కార్యదర్శి తపన్ సేన మాట్లాడుతూ. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాల తీవ్రతను పెంచాలని సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ మహాసభ ప్రతినిధులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సీఐటీయూ ఐదో రాష్ట్ర మహాసభలకు చుక్క రాములు, ఎస్వీ రమ, భూపాల్, జె మల్లిఖార్జున్అధ్యక్ష, వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా తపన్ సేన్ ప్రారంభ ఉపన్యాసం చేశారు. మహాసభలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు ప్రతి సమస్యలపై చేసిన తీర్మానాల సందేశాన్ని కార్మికుడికి చేరేలా తగిన ప్లాన్ చేయాలని సూచించారు. కార్మికులు సృష్టించిన సంపద, ఖనిజాలను కారు చౌకగా కార్పొరేట్లు ప్రభుత్వంలోని వారి ఏజెంట్ల ద్వారా దోచుకుంటున్నారని తెలిపారు. వారికి వ్యతిరేకంగా దేశ కార్మిక వర్గాన్ని ఐక్యం చేయటమే లక్ష్యంగా దిక్కరణ, ప్రతిఘటన అనే నినాదంతో సమరశీల పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం పెరిగిందని చెప్పారు. 'దేశాన్ని రక్షించుకుందాం ప్రజలని 'రక్షించుకుందాం' అనే స్ఫూర్తితో తమ మహాసభల్లో తీర్మానాలు చేయాలని సూచించారు. 76ఏండ్ల స్వాతంత్ర భారతంలో సాధించుకున్న హక్కులను పాలకులు కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు తగినట్టుగా డాన్స్ చేస్తున్నదని ఎద్దేవా చేశారు. పాలకులు విదేశీ ప్రయోజనాలకోసమే నిర్ణయాలు చేస్తున్నారనీ, వారి స్వప్రయోజనాల కోసమే పని చేస్తున్నారని విమర్శించారు. ఇందుకు మీడియాను, ఇతర ఏజెన్సీలను సమర్ధవంతంగా రకంగా వినియోగించుకుంటున్నదనీ, తద్వారా అబద్ధాలను ప్రచారం చేస్తున్నదని తెలిపారు. కార్మికుల మధ్య అనైక్యతను పెంచేందుకు కులం, మతం, ప్రాంత విభేదాలను సృష్టిస్తున్నదని చెప్పారు. ఈ కుట్రలను కార్మికులు. ప్రజలు అర్థం చేసుకునేలా చైతన్యాన్ని కల్పించాలని సూచించారు. కోరుకునేదేందంటే.. విషపూరితమైన పాలకులు కార్పొరేట్లకు యూనియన్లు పోరాటాలే లేని, స్వేచ్ఛాయుతమైన లాభార్జనకోసం పరిస్థితులను కల్పించటమే పాలకుల ధ్యేయమని చెప్పారు. లేబర్ కోడ్ల విషయంలో ప్రతిపక్షాలన్నీ వ్యతిరేకించాయి. దీనికి కారణం కూడా కార్మిక ఐక్య కారణమని చెప్పారు. ఇలాంటి పోరాటాలు మరిన్ని జరగాలని సూచించారు. మనం ఎక్కడున్నాం. ఎక్కడికి చేరాలి? అనేది చర్చించాలని ఆలోచించాలన్నారు. కార్మిక ఉద్యమం పాలకుల కుట్రలు అర్థం చేసుకుని కార్పొరేట్ల వారికి తాబేదార్లుగా ఉన్న పాలకుల కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. జాతీయ మహాసభలో తగిన కార్యాచరణ చేస్తుందని తెలిపారు. కర్నాటకలో ఒక రోజు సమ్మెతో 12గంటల పనివిధానాన్ని తిప్పికొట్టారని గుర్తు చేశారు. పోరోటాలు, ఆందోళనలను మరింత ఉధృతం చేసేందుకు తగిన విధంగా చర్చలు జరపాలను సూచించారు. ఈ మహాసభలలో జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులు ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నిబంధనలకు విరుద్ధంగా వైన్ షాప్
తొలగించమంటే బెదిరింపులా?

- **బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్**

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 8: నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వైన్ షాపును తొలగించాలని కోరితే స్పందించాల్సింది పోయి ఉల్టా కేసులు పెడతామని బెదిరించడం ఎంతవరకు సమంజసం అని బిజెపి సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్ ప్రశ్నించారు. ఎక్సైజ్ నిబంధనల ప్రకారం వైన్ షాపులు ఆలయ సమీపంలో ఉండకూడదని,కానీ రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా దాసాంజనేయ గుడి సమీపంలో వైన్ షాప్ ఏర్పాటుచేసిన అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని నిలదీశారు.సోమవారం పార్టీ నాయకులతో కలిసి వైన్ షాప్ దగ్గర ఆలయ పవిత్రతను దెబ్బతీసే విధంగా వైన్స్ ఏర్పాటు చేసినందుకు ఎవరు ఇక్కడ మద్యం కొనరాదని ఫ్లెక్సీ ఏర్పాటు చేసి మాట్లాడారు.వైన్ షాప్ తొలగించాలని ఆందోళనలు చేపట్టి,ఉన్నత అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.ప్రభుత్వం నిబంధనలు విరుద్ధంగా షాపులకు లైసెన్స్ ఇచ్చి మద్యం అమ్మకాలను ఎంత ప్రోత్సహిస్తుందో దీన్నిబట్టి చూస్తే అర్థం అవుతుందని విమర్శించారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే అక్కడి నుండి వైన్స్ ను తొలగించాలని డిమాండ్ చేశారు.హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఎవరు తప్పు చేసినా సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కాసన గొట్టు సంతోష్, గుండ్ల జనార్ద న్ కెమ్మసారం సంతోష్ కుమార్, దాబా నరేష్,బొడ్డు సునీల్,చెంది సత్యనారాయణ, కొంగర పవన్,అరిగే యాదగిరి,వెంకటరావు, రవితేజ,కరుణాకర్ ,సంతోష్ ,ప్రసాద్ ,గడిచెర్ల పల్లి శ్రీను ,అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



మానవత్వం చాటుకున్న కత్తి కార్తీక గౌడ్

- **రోడ్డునపడ్డ వృద్ధ దంపతులకు పదివేల రూపాయల ఆర్థిక సాయం**

ప్రతిపక్షం, దుబ్బాక, డిసెంబర్ 8: దుబ్బాక మున్సిపాలిటీ కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట కొన్ని సంవత్సరాలుగా అద్దెకు తీసుకున్న చిన్న ప్లాస్టిక్ , జనరల్ దుకాణం ఆధారంగా జీవనం సాగిస్తున్న వృద్ధ దంపతులు గుడ్ల వెంకన్న, నరసవ్వలు అకస్మాత్తుగా జరిగిన అగ్నిప్రమాదంలో వారి చిన్న దుకాణం పూర్తిగా బూడిదైపోయి, జీవనాధారం ఒక్కసారిగా కుప్ప కూలిన పరిస్థితి నెలకొంది. కన్నీళ్లు మిన్నంటిన ఆ వృద్ధ దంపతులను సోమవారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక గౌడ్ పరామర్శించి ఓదార్చారు. తన వంతు మానవత్వాన్ని చాటుకుంటూ 10,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని ఆ వృద్ధ దంపతుల కు అందించారు. ఆమె వెంట బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ ఆస్తులు పోగేస్తే జప్తు చేయండి

- **ఐదేళ్ల పాటు నిజాయితీగా పని చేస్తా**
- **సర్పంచిగా గెలిపించండి**
- **బాండ్ పేపర్ పై అభ్యర్థి వాగ్మూలం**



ప్రతిపక్షం, నంగునూరు, డిసెంబర్ 8: అవకాశం ఇస్తే పదవి కాలమంతా ప్రజాసేవకు అంకితమవుతాను. సర్పంచ్ గెలిపిస్తే పదవి కాలంలో ఒక్క రూపాయి కూడా అక్రమ ఆస్తి సంపాదించినా ప్రజలు తన ఆస్తులను జప్తు చేసుకోవచ్చు.... అంటూ సర్పంచి పదవికి పోటీ చేస్తున్న ఓ అభ్యర్థి బాండ్ పేపర్ పై డిక్లరేషన్ (వాంగ్మూలం) రాసి ఇచ్చారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాజగోపాలపేటలో సర్పంచి పదవికి పోటీ చేస్తున్న అభ్యర్థి రాసిన బాండ్ పేపర్ సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాజగోపాల్ పేట గ్రామ సర్పంచ్ పదవి బీసీ మహిళలకు కేటాయించారు. ఈ క్రమంలో గ్రామంలో ఆయుర్వేద వైద్యునిగా పనిచేస్తున్న చేర్యాల రాధాకృష్ణ సతీమణి చేర్యాల వాణి సర్పంచి పదవికి నామినేషన్ వేశారు. గుర్తులను కేటాయించడంతో ప్రచారం సాగిస్తున్నారు. ఈ క్రమంలోరూ.100ల బాండ్ పేపర్ పై ప్రజలకు స్పష్టమైన డిక్లరేషన్ రాసి ఇచ్చారు. సర్పంచ్ పదవికి తనను ఎన్నుకుంటే ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ప్రతి రూపాయిని కూడా లెక్కల రూపంలో చెప్పి గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ప్రకటించారు. పదవీకాలంలో తనకు గాని తన కుటుంబానికి గాని ప్రస్తుతం ఉన్న ఆస్తుల కన్నా ఎంత ఎక్కువ పెరిగినా పెరిగిన ఆస్తిని అక్రమ ఆస్తి కింద గుర్తించి జప్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. గ్రామ పంచాయితీ సొమ్మును అక్రమంగా ఖర్చు చేయనని ప్రమాణం చేశారు. ఏ పార్టీ నాయకునికి కూడా కొమ్ముకాయనని వాగ్దానం చేశారు. గ్రామ ప్రజలందరికీ నిర్ణయం మేరకు అభివృద్ధి పనులను చేపడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని ప్రకటించారు. ప్రజలకు విశ్వాసం కలిగించడానికి తాను చేస్తున్న పనిని గుర్తించి ప్రజలు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

పంచాయతీ ఎన్నికల్లో బాండ్ పేపర్ ట్రెండ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 8: పంచాయతీ ఎన్నికల్లో బ్రాండ్ బాండ్ పేపర్ ట్రెండ్ నడుస్తోంది. రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో బక్కరాణి అనే ఓ సర్పంచ్ అభ్యర్థి వినూత్నంగా ప్రచారం చేస్తూ గ్రామస్తులను ఆకట్టుకుంటున్నారు. గ్రామ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గ్రామ మేనిఫెస్టోను రూపొందించారు. అందులోని 30అంశాలు గ్రామలోని యువతను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. గ్రామ మేనిఫెస్టోతో పాటు బాండ్ పేపర్ ను కూడా విడుదల చేశారు. ప్రస్తుతం ఉన్న ఆస్తుల కంటే ఐదేళ్లలో ఒక్క రూపాయి పెరిగిన గ్రామపంచాయతీకి జప్తి చేసుకునే అధికారం ఉందని, గ్రామ సర్పంచ్ గా గెలిచిన వెంటనే ముదిరాజ్, రజక, గంగపుత్ర సంఘాల చెందిన వార్డు సభ్యుల్లో ఒకరిని ఉప సర్పంచ్ ను చేస్తానని హామీనిచ్చారు. ప్రస్తుతం ఈ అంశం హాట్ టాపిక్ గా మారింది.

ప్రజాస్వామ్యంలో ఓటరు కీలకం

- **జిల్లా ఎస్పీ డీ.వీ.శ్రీనివాస రావు**



ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 8: ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటరు కీలకమని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు అన్నారు.మెదక్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు శాంతియుతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు ప్రతి ఓటరు సహకరించాలని సోమవారం జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్బంగా ఎస్పీ ఓటర్లకు పలు సూచనలు చేశారు. మీ పేరు తాజా ఓటర్ జాబితాలో ఉన్నదో లేదో తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ వివరాలను ముందుగానే తెలుసుకోవాలన్నారు. పోలింగ్ రోజున ఓటర్ ఐడి ఇతర వ్యాలిడ్ ప్రభుత్వ ఫోటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. తెలియని వ్యక్తులకు ఓటర్ ఐడి లేదా ఓటర్ స్లిప్ ఇవ్వకూడదన్నారు.పోలింగ్ కేంద్రంలో క్యూలో నిలబడి సిబ్బంది సూచనలు పాటిస్తూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రం పరిసరాల్లో ముఖ్యంగా 100 మీటర్ల పరిధిలో ప్రచారం పూర్తిగా నిషేధించడం జరిగిందన్నారు. వేరొకరి పేరు మీద ఓటు వేయడానికి ప్రయత్నించడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద గుమిగూడడం నిషేధమని, ఉల్లంఘనలపై చర్యలు తీసుకోబడతాయన్నారు. కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి అని వివరించారు. సౌండ్ సిస్టమ్, బాణాసంచా వినియోగం కోసం పోలీసు అనుమతి తప్పనిసరి అని తెలిపారు. ఎన్నికలు శాంతియుతంగా జరగేందుకు నియమాలు పాటిస్తూ, ప్రజాస్వామ్య హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



కాంగ్రెస్ వల్లే గ్రామాలు అభివృద్ధి

- **కాంగ్రెస్ ను ప్రజలు ఆదరిస్తున్నారు**
- **కాంగ్రెస్ పార్టీ సిద్ధిపేట పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్**


ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 8: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్లే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి అని కాంగ్రెస్ పార్టీ సిద్ధిపేట పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. స్థానిక ఎన్నికల సందర్భంగా చిన్నకోడూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి గణేష్ గౌడ్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ పార్టీ సిద్ధిపేట పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సిద్ధిపేట పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను చూసి ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థిని ఆదరిస్తున్నారు అని అన్నారు. సిద్ధిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించాలి అని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది గనుక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే గ్రామాలకు నిధులు వస్తాయి అని అన్నారు. చిన్నకోడూరు అభ్యర్థి గణేష్ గౌడ్ కు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మార్క్ సతీష్ గౌడ్ ఖర్చుల నిమిత్తం రూ. 5000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్యాదారి మధు గాయాజుద్దీన్ హర్షద్ బాబా సాదిక్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తా

- **నిజాంపేట్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి చలిమేటి నరేందర్**

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 8: ఒక్కసారి అవకాశం ఇచ్చి గ్రామ సర్పంచ్‌గా గెలిపించాలని నిజాంపేట్ గ్రామసర్పంచ్ అభ్యర్థి చలిమేటి నరేందర్ గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం నిజాంపేట్ గ్రామంలో నరేందర్ ఇంటింటికి ప్రచారాన్ని జోరుగా నిర్వహించారు. ఈనెల 14 న జరిగే సర్పంచ్ ఎన్నికల్లో బ్యాట్ గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారితే గెలిపించాలని ఓటర్లను కోరారు. గ్రామంలో ఏ సమస్య వచ్చిన వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. గ్రామ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవ చేస్తానని,సేవ చేసే అవకాశాన్ని తన కల్పించాలని ప్రజలకు విన్నపించారు.గ్రామంలోని యువతకు అండగా ఉంటానని పేర్కొన్నారు. ఒక్కసారి అవకాశం ఇచ్చి తనను భారీ మెజార్టీతో గెలిపించినట్లయితే గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. మీ గ్రామ బిడ్డగా సేవ చేసే భాగ్యాన్ని కల్పించాలని కోరారు. గ్రామంలో నిర్వహించే ప్రచారానికి ప్రజల నుండి అపూర్వస్పందన లభిస్తుందన్నారు.



కాలంకన్నా ముందునడిచేవాడే కవి

- **తెరవే రాష్ట్ర అధ్యక్షులు కొండి మల్లారెడ్డి**

ప్రతిపక్షం బ్యూరో సిద్ధిపేట , డిసెంబర్ 8: కాల ప్రవాహంలో పడి కొట్టుకుపోయే వారికంటే, కాలం కన్నా ఒకక్షణం ముందు నిలబడి రాబోయే ఉపద్రవాన్ని పసిగట్టి సమూహాన్ని అప్రమత్తం చేసేవారే కవులు రచయితలుగా నిలదొక్కుకోగలుగుతారని తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షులు కొండి మల్లారెడ్డి అన్నారు.సిద్ధిపేట ప్రెస్ క్లబ్ లో జరిగిన సీనియర్ కవి మహమూద్ పాషా కవిత్వ సంపుటి "కలవార"ఆవిష్కరణసభకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.మూడు దశాబ్దాల క్రితమే ప్రపంచీకరణ ప్రభావంవల్ల రాబోయే పరిణామాలను పర్యవసానాలను గమనించిన కవులు రచయితలు తమ రచనల ద్వారా ముందస్తు హెచ్చరికలు జారీచేసినప్పుడు అందరూ తేలికగా కొట్టిపారేసారని ఇప్పుడు అన్ని వైపుల నుండి చాపకిందనీరులా తమ కాళ్ళ కిందికి వస్తేతప్ప దాని దుష్పరిణామాలు తెలిసిరాలేదన్నారు. వస్తు వ్యామోహం పెచ్చుమీరి మానవ సంబంధాలు బీటలు వారి విచ్ఛిన్నమైపోతున్నాయని ప్రతీదీ ఆర్థిక సంబంధమైపోయిందని, అవినీతి బంధుప్రీతి అరాచకత్వం పెచ్చుమీరి వనరుల విధ్వంసం యధేచ్ఛగా కొనసాగుతున్న ఈ సంక్లిష్ట సమయంలోనే కవులు రచయితలు తమ కలాలకు పదునుపెట్టి అస్తవ్యస్తమైన వ్యవస్థను సవ్యదిశలో నడిపించాలన్నారు. సీనియర్ కవి మహమూద్ పాషా గత నలభైసంవత్సరాలుగా సాహితీ సేద్యం చేస్తూ తన రెండవ పుస్తకంగా కలవార ను ప్రచురించడం అభినందనీయమన్నారు. మహమూద్ పాషా కవిత్వం చదివితే గత నాలుగు దశాబ్దాల సామాజిక ఆర్థిక రాజకీయ ఉద్యమ సంక్షోభాలన్నీ అంచనా వేయవచ్చన్నారు. ఈకార్యక్రమంలో తెలంగాణరచయితలవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు పర్కపెల్లియాదగిరి, గఫూర్ శిక్షక్, కార్యదర్శులు ఉప్పలపద్మ, ఆడెపులక్షణ్, తౌడబోయిన తిరుపతి, వంగర నరసింహారెడ్డి, అశోక్ రాజు, కొమురవెల్లి అంజయ్య, స్రవంతి మహిపాల్, మోరమోహన్, త్రివిక్రమశర్మ, ఉమాశంకర్, మహేందర్, సుధాకర్, శ్రీధర్, ఎడ్లలక్ష్మి, వెంకటేశ్వర్లు, సాజిత్, సర్దార్ హుస్సేన్, కవులు రచయితలు సాహిత్యాభిమానులు మహమూద్ పాషా బంధుమిత్రులు పాల్గొన్నారు.



సనాతన ధర్మం మూఢనమ్మకం కాదు. అధ్యాత్మిక శాస్త్రం. తమిళనాడులో మన ధర్మాన్ని మనం అనుసరించడం కోసం న్యాయ పోరాటాలు చేయాల్సి వచ్చింది. భవిష్యత్తులో ఇలా జరగకుండా ప్రతి హిందువులో చైతన్యం రావాలి. భగవద్గీత ప్రాంతాలకో, మతాలకో ఉద్దేశించిన గ్రంథం కాదు. ముఖ్యంగా యువత గీత చదవాలి. మనసు కుంగినా, ఆలోచనలు అయోమయంలోకి నెట్టినా గీత ఓ కౌన్సిలర్, మెంటర్‌గా పనిచేస్తుంది.
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్

ప్రాంతీయం

మియాపూర్‌లో ఆక్రమణలను తొలగించిన హైడ్రా

- రూ. 600ల కోట్ల విలువైన 5 ఎకరాల భూమికి ఫెన్సింగ్



ప్రతిపక్షం, సిటి బ్యూరో , డిసెంబరు 8: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ విలేజ్ మక్తామ హబూబ్ పేటలో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా సోమవారం కాపాడింది. 5 ఎకరాల మేర ఉన్న మక్తామ హబూబ్ కుంటను కబ్జా చేసేయాలనే ప్రయత్నాలను కూడా అడ్డుకుంది. ఇక్కడ కబ్జాల చెర నుంచి కాపాడిన 5 ఎకరాల ప్రభుత్వ భూమి విలువ రూ. 600ల కోట్లకు పైగా ఉంటుందని అంచనా. మియాపూర్ బాచుపల్లి ప్రధాన రహదారికి సమాంతరంగా ఉన్న చెరువు కట్ట పై 200ల మీటర్ల మేర వేసిన 18 షెట్టర్లను తొలగించింది. దుకాణాల వెనుక వైపు ప్రైవేటు బస్సుల పార్కింగ్ ఉంచిన స్థలాన్నికూడా హైడ్రా ఖాళీ చేయించింది. మియాపూర్ సర్వే నంబర్ 39లో మక్తామహబూబ్‌పేట చెరువు కట్ట కబ్జాతో పాటు.. గతంలో మైనింగ్‌కు ఇచ్చిన సర్వేనంబరు 44/5 లో ఉన్న 5 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురౌతున్నట్టు స్థానికుల నుంచి హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు అందింది. ఒక్కో షెట్టర్ (దుకాణం) నుంచి నెలకు రూ. 50 వేల చొప్పున రూ. 9 లక్షల వరకూ వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే అక్కడ ప్రైవేటు బస్సుల పార్కింగ్‌కు స్థలాన్ని ఇచ్చి నెలకు రూ. 8 లక్షల వరకూ వసూలు చేస్తున్నారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదు మేరకు కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో హైడ్రా క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో పరిశీలించింది.


బడాబాబుల మద్ధతుతో సర్వే నంబరు 44/5 కు బదులు 44/4 నంబరును సృష్టించి 5 ఎకరాల భూమిని కబ్జా చేసినట్టు హైడ్రా విచారణలో తేలింది. కారు వాషింగ్ సెంటర్ ఏర్పాటు చేసుకుని మొత్తం ఈ భూమిని కబ్జా చేసినట్టు వెల్లడైంది. మైనింగ్‌కు ఇచ్చిన భూమి గడువు పెంచాలని దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం నిరాకరించింది. మైనింగ్‌కు ఇచ్చిన భూమిలోనే తప్పుడు సర్వే నంబరు(44/4)తో ఈ కబ్జాలకు పాల్పడినట్టు వెల్లడైంది. శేరిలింగంపల్లి తహసీల్దార్ గతంలో 2013లో నోటీసు ఇచ్చి ఈ షెట్టర్లను తొలగించినట్టు కూడా తేలింది. కబ్జాలకు పాల్పడిన కూన సత్యంగౌడ్, బండారి అశోక్ ముదిరాజ్‌ల వెనుక బడాబాబులున్నట్టు సమాచారం. వారు వెనుక ఉండి వీరితో కబ్జాల పర్వాన్ని నడుపుతున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ భూమి తమదని చెబుతున్న వారి వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడమే కాకుండా.. తాము వేరే వాళ్లతో అగ్రిమెంట్ కుదుర్చుకున్నామని చెబుతున్నారు. వేరే వాళ్లు ఎవరనేది తేలాల్సి ఉంది. ఈ లోగా ప్రభుత్వ భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ఈ భూమికి ఆనుకుని ఉన్న 5 ఎకరాల చెరువు కబ్జా ప్రయత్నాలకు కూడా హైడ్రా చెక్ పెట్టింది.



వీరపూర్ సర్పంచ్ ను అభినందిన ఎమ్మెల్యే

ప్రతిపక్షం ప్రతినిధి, జగిత్యాల, డిసెంబర్ 8: వీరాపూర్ గ్రామ సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన దిండిగాల గంగవ్వ రామస్వామి, ఉప సర్పంచ్ నర్సారెడ్డి, వార్డు సభ్యులు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ను క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన గ్రామ పంచాయతీ పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించి, జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, ఇంతియాజ్,చెట్పల్లి సుధాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ మృతి



ప్రతిపక్షం బ్యూరో,కరీంనగర్, డిసెంబర్ 8: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నఎర్రోజు దేవేందర్ (53) గుండెపోటు కారణంగా సోమవారం మృతి చెందారు.హెడ్ కానిస్టేబుల్ దేవేందర్ ఉదయం కరీంనగర్‌లోని గాంధీ చౌరస్తాలో మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ డ్యూటీలో పాల్గొన్నారు. డ్యూటీ ముగించుకుని ఇంటికి చేరుకున్న వెంటనే ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. 1992లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరిన దేవేందర్, ఆ తర్వాత సివిల్ పోలీసు కానిస్టేబుల్‌గా కన్వర్షన్ పొంది, ప్రస్తుతం హెడ్ కానిస్టేబుల్‌గా తన సేవలు అందిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.ఈ ఘటనపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ మృతి పట్ల ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. విషయం తెలిసిన వెంటనే ట్రాఫిక్ ఏసీపీ, సీఐలు, ఎస్‌ఐలు తదితర పోలీసు ఉన్నతాధికారులు ఆసుపత్రికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.



ట్రాఫిక్ పోస్ట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం

ప్రతిపక్షం, హుస్నాబాద్, డిసెంబర్ 8: హుస్నాబాద్ పట్టణంలో తీవ్రమైన ట్రాఫిక్ రద్దీని తగ్గించి, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక ట్రాఫిక్ పోస్ట్ ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదనల్లో భాగంగా సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్, సిద్దిపేట టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ఎస్‌ఐ నీరేశ్ పట్టణంలోని పలు రద్దీ ప్రాంతాలను స్వయంగా సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఈ పర్యవేక్షణలో హుస్నాబాద్ ఏసీపీ సదానంద్ తో పాటు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్‌ఐ లక్ష్మారెడ్డి కూడా పాల్గొన్నారు. శుక్రవారం సంత, పశువుల మార్కెట్ వంటి వాటి కారణంగా రద్దీ అధికంగా ఉండే మల్లెచెట్టు చౌరస్తా ప్రాంతాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా అంబేద్కర్ చౌరస్తా, అక్కన్నపేట రోడ్డు కూడళ్ల వద్ద తరచుగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్‌ను సజావుగా, నిరాటంకంగా నడిపించడానికి తక్షణ చర్యలు అవసరమని ఈ సందర్భంగా నిర్ణయించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని, కొత్తగా ఏర్పాటు చేయబోయే ట్రాఫిక్ పోస్ట్ కోసం ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ తో పాటు ఆరుగురు పోలీస్ కానిస్టేబుళ్లు అవసరమని ఏసీపీ ట్రాఫిక్ తన నివేదికలో ప్రతిపాదించారు. అంతేకాక, ట్రాఫిక్ విధులు నిర్వహించే సిబ్బంది కోసం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఒక ప్రత్యేక గదిని కేటాయించడానికి ఇప్పటికే ఏర్పాట్లు చేయనున్నారు. ఈ ప్రతిపాదనలను ఉన్నతాధికారుల పరిశీలన కోసం పంపనున్నారు. ప్రతిపాదనలకు ఆమోదం లభించిన వెంటనే ట్రాఫిక్ పోస్ట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులు

పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ పి. ప్రావీణ్య



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి,డిసెంబర్ 8 : జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు గాను ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రతి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించిందని కలెక్టర్ తెలిపారు.ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులు సంబంధిత మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయాలో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. మొదటి దశ ఎన్నికలు నిర్వహించనున్న గుమ్మడిదల, హత్నూర ,కంది, కొండాపూర్, పటాన్చెరు, సదాశివపేట, సంగారెడ్డి మండలాలల్లో ఎన్నికల విధులు కేటాయించిన ఉద్యోగులందరూ ఈ నెల 9 వ తేదీ లోపు సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకుని ఓటు వేయాలని కోరారు. అదే విధంగా రెండవ దశలో ఎన్నికలు జరగనున్న అందోల్, చౌటకూర్, ఝరాసంగం, కోహీర్, మొగుడంపల్లి, మునిపల్లి, పుల్కల్, రాయికోడ్, వట్ పల్లి, జహీరాబాద్ మండలాల్లో ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు డిసెంబర్ 10 నుండి 12 వ తేదీలోపు సంబంధిత మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలోని ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.మూడవ దశ ఎన్నికలు జరగనున్న కల్హేర్, కంగిటి, మనూర్, నాగల్ గిద్ద, నారాయణఖేడ్, నిజాంపేట్, సిర్గాపూర్, న్యాల్కల్ మండలాల లో ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు సంబంధిత మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో డిసెంబర్ 13 నుండి 15వ తేదీ లోపు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆయా ఉద్యోగులు సంబంధిత మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో నిర్ణీత తేదీలోగా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.




ఆర్థిక సాయం

మొయినాబాద్, ప్రతిపక్షం, డిసెంబర్ 8: మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామానికి చెందిన బోడ పెంటమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ రాంచెందర్ (రత్నం) మృతురాలి కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. గ్రామంలోని పేద ప్రజలకు అండగా నిలుస్తున్న గ్రామ మాజీ సర్పంచ్ రాంచెందర్ (రత్నం) బోడ పెంటమ్మ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ.. గ్రామ మాజీ సర్పంచ్ రాంచెందర్ (రత్నం) మాట్లాడుతూ.. దేవుడు వారి కుటుంబానికి ధైర్యం ఇవ్వాలని భాగోద్వేగంతో పేర్కొన్నారు. పేద ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను ముందుంటానని, మృతురాలి కుటుంబ సభ్యులకు ధైర్యం నింపారు. మాజీ సర్పంచ్ ఇచ్చిన చేయూతపై కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నరసింహ, అర్జునయ్య, ప్రహ్లాద్, శేఖర్, మోహన్, అంతయ్య, చంద్రమౌళి, రాజు, చంద్రయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

మీ వాడిని..మీలో ఒక్కడిని.. ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా

- ఉంగరం గుర్తుపై ఓటేసి గెలిపించండి.
- బాకారం గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఎల్గని వెంకటేష్ గౌడ్.



ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 08 : మీ వాడిని... మీలో ఒక్కడిని...మీ మధ్యే ఉంటూ అశీర్వదిస్తే బాకారం గ్రామాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని బాకారం గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఎల్గని వెంకటేష్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఉంగరం గుర్తుపై ఓటువేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గ్రామాభివృద్ధికి అందరి సహకారం తీసుకొని అభివృద్ధి చేస్థానని తెలిపారు.అవకాశం ఇస్తే గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. గ్రామంలో సిసి రోడ్లు పూర్తి చేయడంతో పాటు, డ్రైనేజి సమస్యలను శాశ్వత పరిష్కారం చూపించడంతో పాటు పరిశుభ్రతపై దృష్టి పెట్టి ఆరోగ్య గ్రామంగా తీర్చిదిద్దుతానని తెలిపారు.ప్రభుత్వ సహకారంతో నిధులను గ్రామానికి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తూ వారి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళుతామన్నారు. గ్రామంలో ప్రజలకు అందు బాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం దిశగా ముందుకు సాగుతా అన్నారు. గ్రామంలో ప్రతి ఇంటి సమస్య నా సమస్య దిశగా కృషి చేస్తానన్నారు. మీ అందరి సహకారంతో ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామంలో ప్రధాన సమస్యలను గ్రామ పెద్దలు, ఇతర ప్రజా ప్రతినిధుల సహకారం తీసుకొని అన్ని రంగాల్లో గ్రామాన్ని అభివృద్ధి పథంలో దూసుకు వెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తానని అన్నారు.



నాగిరెడ్డిగూడ అభివృద్ధే నా లక్ష్యం

- నాగిరెడ్డిగూడ సర్పంచ్ అభ్యర్థి కీసరి పద్మ సంజీవరెడ్డి

ప్రతిపక్షం,మొయినాబాద్, డిసెంబర్ 8: ఒక్క ఛాన్స్ ఇవ్వండి..మార్పు చేసి చూపిస్తా, గ్రామాభివృద్దే లక్ష్యంగా పని చేస్తా, సర్పంచ్ గా గెలిపించాలని నాగిరెడ్డిగూడ సర్పంచ్ అభ్యర్థి కీసరి పద్మ సంజీవరెడ్డి కోరారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సర్పంచ్ గా గెలిపించి ప్రజా సేవ చేసే భాగ్యం కల్పించాలని ఓటర్లను కోరుకున్నారు. అవకాశం ఇస్తే గ్రామ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. అదే విధంగా గ్రామ అభివృద్ధిపై పలు హామీలను వెల్లడించారు. గ్రామంలో సీసీ రోడ్డులు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం, హైమాక్స్ లైట్లు ఏర్పాటుకి "కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కృషి చేస్తాను. ఎస్సీ, బీసీ కాలనీల్లో సైడ్ డ్రైనేజీల ఏర్పాటు, త్రాగునీటి సమస్యలపై చర్యలు తీసుకుంటాను. గ్రామ ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటూ గ్రామానికి సమర్థవంతమైన పరిపాలన అందించడమే తన లక్ష్యమని సర్పంచ్ అభ్యర్థి కీసరి పద్మ సంజీవరెడ్డి పేర్కొన్నారు.



ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం

- జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్


ప్రతిపక్షం ప్రతినిధి, జగిత్యాల, డిసెంబర్ 8: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా సోమవారం కొడిమ్యాల మండలం కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రిసైడింగ్ అధికారులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పరిశీలించి పలు అంశాల మీద ప్రిసైడింగ్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు చాలా కీలకమైనదని, ప్రతీ అంశం పైన క్షుణ్ణం గా అవగాహన కల్పించుకొని విధులను నిర్వర్తించాలన్నారు. ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామాగ్రి సేకరించడం, పూర్తి సామాగ్రి ఉందోలేదో ఎలా సరిచూసుకోవడం, ఓటర్ లిస్ట్, బ్యాలెట్ పేపర్స్ చెక్ చేసుకోవడం, బ్యాలెట్ బాక్స్ ఎలా సీల్ చేయాలి, ఛాలెంజ్ ఓటు, టెండర్ ఓటు, బ్యాలెట్ పేపర్స్ ఇవ్వడం, పీఓ డైరీ నింపడం, అన్ని ఫార్మ్స్ ఎలా నింపాలి, ఏజెంట్స్ సిగ్నేచర్ ఎక్కడ తీసుకోవాలి, పోలింగ్ పూర్తి అయిన తర్వాత బ్యాలెట్ బ్యాక్ సీలింగ్, ఓట్స్ కౌంటింగ్, ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహణ, సర్పంచ్, ఉప సర్పంచ్ నియామక పత్రాలు ఇవ్వడం తదితర అంశాల మీద పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు వారికి ఏర్పాటు చేసిన చోటనే బస చేయాలని, అందుబాటులో ఉన్న బంధువుల ఇంటికి గాని, అభ్యర్థుల ఇంటికి గాని వెళ్లరాదని జిల్లా కలెక్టర్ తెలిపారు.పోలింగ్ ముందు రోజు నుండి కౌంటింగ్ వరకు ప్రిసైడింగ్ అధికారుల కార్యాచరణ, విధులు, బాధ్యత లు తీసుకోవలిసిన జాగ్రత్త లను పవర్ పాయింట్ ప్రసెంటేషన్ ద్వారా మాస్టర్ ట్రైనర్స్ వివరించారు.శిక్షణ జరుగుతున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించి ఎన్నికలు సజావుగా జరిగే విధంగా తగు సూచనలు చేశారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ఎమ్మార్వో కిరణ్ కుమార్, ఎంపీడీఓ స్వరూప మరియు తదితరులు పాల్గొన్నారు.

వచ్చిన ప్రతి రూపాయి నియోజకవర్గానికే

- రెండేళ్లలో 130 కోట్ల భారీ నిధులు
- అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 8: అర్బన్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా గత రెండు సంవత్సరాల కాలంలో సుమారు రూ.130 కోట్ల నిధులు తీసుకురావడంలో తాను విజయం సాధించానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ వెల్లడించారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్నకీలక ప్రాజెక్టులను పూర్తి చేయడానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను ముఖ్యమంత్రికి నిరంతరం లేఖలు రాయడం, అసెంబ్లీలో డిమాండ్ చేయడం ద్వారా నిధులను సాధించినట్లు ఎమ్మెల్యే వివరించారు. టీయూఎఫ్ఐడీసీ ద్వారా ప్రతి డివిజన్ అభివృద్ధి కోసం రూ. కోటి చొప్పున నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. ప్రభుత్వ ప్రత్యేక నిధులు తాను డిమాండ్ చేసిన రూ. 100 కోట్ల ప్రతిపాదనలో ప్రభుత్వం గత నెలలో రూ. 37 కోట్లు విడుదల చేసిందన్నారు. నుడా ద్వారా అభివృద్ధి పనుల కోసం రూ. 23 కోట్లు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి రూ. 2.76 కోట్లు, 396 డబుల్ బెడ్ రూముల నిర్మాణం, మరమ్మత్తుల కొరకు రూ. 1.25 కోట్లు, పెండింగ్ పనులు స్పెషల్ ఫండ్ ప్రగతి నగర్ స్మశాన వాటిక రూ. 3.8 కోట్లు, సోనీ ఫంక్షన్ హాల్ దగ్గర ఉన్న బ్రిడ్జి నిర్మాణాం పూర్తి చేయడానికి రూ. 4.6 కోట్లు మొత్తం సుమారు 130 కోట్ల నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి పైసా కూడా అవినీతి లేకుండా నా నియోజకవర్గ అభివృద్ధి కోసం మాత్రమే ఖర్చు పెడతాను. నియోజకవర్గంలో ఆగిపోయిన పెండింగ్‌లో ఉన్న కీలక ప్రాజెక్టులకు నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి నాగల్లో లక్ష్మి నారాయణ, మాస్టర్ శంకర్, బీజేపీ జిల్లా సెక్రెటరీ జ్యోతి, జిల్లా సెక్రెటరీ పుట్టా వీరేందర్, ఆనంద్ రావు, మండల్ ప్రసిడెంట్ నాగరాజు, ఇప్పకాయల కిషోర్, మాజీ కార్పొరేటర్లు ప్రభాకర్, బురుగుల వినోద్, బైకన్ మధు, మల్లేష్‌గుప్తా, మండల ప్రెసిడెంట్ బాబీ సింగ్, ఆకుల శ్రీనివాస్, బట్టు రాఘవేంద్ర బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ హయాంలో రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. రాష్ట్రాన్ని గాడిలో పెడతామన్న తమ మాటలను నమ్మి ప్రజలు కూటమికి అధికారం కట్టబెట్టారు. 18 నెలలుగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాం. పెట్టుబడి వ్యయాన్ని భారీగా పెంచగలిగాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందిస్తున్నాం.

- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

‘ఇండిగో’ పై చర్యలు తప్పవు

- రాజ్యసభలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 8: ఇండిగో సంక్షోభంపై పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు సోమవారం రాజ్యసభలో స్పందించారు. కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ‘‘ఇండిగో సిబ్బంది రోస్టరింగ్ సహా అంతర్గత ప్రణాళిక వైఫల్యం కారణంగానే ఈ సంక్షోభం తలెత్తింది. పౌర విమానయాన రంగంలో కఠినమైన నిబంధనలు అమలు చేస్తున్నాం. ఈ నెల 3వ తేదీ వరకు అన్నీ సజావుగానే సాగాయి. తర్వాత ఇబ్బంది తలెత్తింది. విమానాల రద్దుకు దారితీసిన సాఫ్ట్‌వేర్ విషయంపై విచారణకు ఆదేశించాం. అన్ని విమాన సంస్థలతోనూ చర్చించాం. విమానాశ్రయాల్లో పరిస్థితులను నియంత్రించాం. దీంతో గత రెండు రోజుల్లో పరిస్థితుల్లో మార్పు స్పష్టంగా కనిపించింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని తేలికగా తీసుకోవడం లేదు. ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకుంటాం’’ అని రామ్మోహన్‌నాయుడు తెలిపారు. పౌర విమానయాన రంగంలో భవిష్యత్తులో ఉల్లంఘనలకు పాల్పడే వారికి గుణపాఠం చెప్పేలా తమ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కాగా, ఇండిగో అంశంలో సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తున్నారని రామ్మోహన్‌కు ప్రధాని మోదీ కితాబు ఇచ్చారు. ఇండిగో సంక్షోభంపై సోమవారం రాజ్యసభలో రామ్మోహన్ ఇచ్చిన సమాధానంపై ప్రధాని సంతృప్తి వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న సంక్షోభం

ఇండిగో విమానాల సంక్షోభం వరుసగా ఏడురోజూ కొనసాగింది. సోమవారం కూడా బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ సహా పలు ఆరు మెట్రో విమానాశ్రయాల్లో 562 విమానాల సేవలు రద్దయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు ఇండిగో వ్యవహారంపై అత్యవసరంగా జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రభుత్వం ఈ విషయంలో స్పందించిందని, చర్యలు కూడా తీసుకుందని కోర్టు వ్యాఖ్యానించింది.



విశ్వ వీక్షణం



మోడీ ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతోంది

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 8: ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యలను కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రా తిప్పికొట్టారు. ఆయన ఆత్మవిశ్వాసం రోజు రోజుకూ సన్నగిల్లుతోందన్నారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం వందేమాతరంపై చర్చను చేపట్టిందని ఆరోపించారు. ‘నెహ్రూను తరచూ విమర్శించే బదులు ఆయనకు వ్యతిరేకంగా ఉన్న అన్ని నిందలపై ఒకేసారి చర్చించి ఆ అధ్యాయాన్ని ఇక ముగిద్దాం. అవి 999 లేదా 9999 నిందలు కావచ్చు. ఇందిర, రాజీవ్ ఏమి చేశారో? వారసత్వ రాజకీయాలు ఏమి చేశాయో? మీ ఫిర్యాదులన్నీ దేశానికి ఒకేసారి చెప్పండి. తర్వాత వాటిపై చర్చిద్దాం. ఆ తర్వాత ధరల పెరుగుదల, నిరుద్యోగ సమస్యలపై చర్చిద్దాం’ అన్నారు. మోదీ ప్రధాని పదవిలో 12 ఏళ్లు పూర్తి చేసుకున్నారని, నెహ్రూ దేశ స్వాతంత్ర్యం కోసం 12 ఏళ్లు జైల్లో ఉన్నారని చెప్పారు. లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ మోదీ ఏ అంశంపై మాట్లాడినా.. నెహ్రూ, కాంగ్రెస్‌లను ప్రస్తావించడం అలవాటైపోయిందన్నారు. బీజేపీ పూర్వీకులు వందేమాతరాన్ని ఆలపించలేదన్నారు. సమాజ్‌వాదీ నాయకుడు అఖిలేశ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొననివారు వందేమాతరం విలువల గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ‘విద్వేషాలు సృష్టించేందుకు విచ్ఛిన్న శక్తులు వందేమాతరాన్ని వాడుకుంటున్నాయి. బ్రిటిష్ పాలకుల విభజించుపాలించు విధానాన్నే వీరు అవలంబిస్తున్నారు’ అన్నారు. వందేమాతరం హిందువుల గీతం అన్నట్టు ప్రచారం చేసినవారే ఆ గీతంపై వివాద సృష్టికి, విభజనకు కారకులని డీఎంకే ఎంపీ ఎ.రాజా అన్నారు. దీనిపై వివాదం సమాజం సృష్టించింది కాదని, ముస్లింలు దానికి కారణం కాదని, ఈ గీతానికి మతం రంగు పులిమినవారి వల్లే సమస్య తలెత్తిందన్నారు.

పుదుచ్చేరిలో విజయ్ సభకు షరతులతో అనుమతి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, చెన్నై, డిసెంబర్ 8: పుదుచ్చేరి లో టీవీకే పార్టీ చీఫ్ విజయ్ నిర్వహించతలపెట్టిన బహిరంగ సభకు అక్కడి పోలీసులు అనుమతి మంజూరు చేశారు. మంగళవారం ఉప్పాలం లోని ఎక్స్‌పో గ్రౌండ్ లో సభ జరగనుంది. అయితే పుదుచ్చేరి పోలీసులు సభకు అనుమతి ఇచ్చినా.. కరూర్ తొక్కిసలాట ఘటన నేపథ్యంలో కొన్ని షరతులు విధించారు. పోలీసులు విధించిన షరతుల మేరకు విజయ్ సభా వేదికపై నుంచి కాకుండా ప్రచారం రథంపై నుంచే మాట్లాడనున్నారు. సభకు 5 వేల మందికి మించి హాజరు కాకూడదు. చిన్నారులు, గర్భిణి మహిళలు, వృద్ధులను ఈ సభకు అనుమతించకూడదు. ఈ నిబంధన మేరకు పార్టీ 5 వేల మందికి మాత్రమే ఎంట్రీ పాసులు ఇవ్వాలి. పాసులు ఉన్నవాళ్లు మాత్రమే సభకు రావాలి. ఈ షరతుల నేపథ్యంలో పుదుచ్చేరి సమీపంలోని తమిళనాడు జిల్లాలకు చెందిన వారు సభకు రావద్దని టీవీకే కోరింది. సభా నిర్వాహకులు వెల్లడించిన వివరాల ప్రకారం.. విజయ్ ప్రచార రథం సోమవారం రాత్రి పుదుచ్చేరికి చేరుకోనుంది. విజయ్ మంగళవారం ఉదయం 11 గంటలకు కారులో సభాస్థలికి చేరుకుంటారు. సభకు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అనుమతి ఉంది. విజయ్ మధ్యాహ్నం 12 గంటలకు ప్రసంగం మొదలుపెట్టనున్నారు.



సిద్ధరామయ్యకు సుప్రీం నోటీసులు


ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 8:: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారని దాఖలైన పిటిషన్‌కు స్పందించిన సుప్రీంకోర్టు ఆయనకు సోమవారం నోటీసులు జారీ చేసింది. మైసూరు జిల్లా వరుణ నియోజకవర్గం నుంచి 2023లో సిద్ధరామయ్య ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆయన అక్రమాలకు పాల్పడ్డారని శంకర్ అనే వ్యక్తి గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు కొట్టివేయడంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ విక్రమనాథ, జస్టిస్ సందీప్ మెహతా నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌ను సోమవారం విచారించింది. దీనికి బదులివ్వాలని సీఎం సిద్ధరామయ్యతో పాటు ఎన్నికల కమిషన్‌కు సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది.





ఐదున్నరేళ్లలో 6.15 లక్షల కోట్ల లోన్లు రైటాఫ్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 8: గత ఐదున్నరేళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లు రూ.6.15 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ చేశాయని లోక్‌సభలో కేంద్రం తెలిపింది. ‘ఆర్బీఐ డేటా ప్రకారం.. గత ఐదు ఆర్థిక సంవత్సరాలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబరు 30 వరకు ప్రభుత్వ రంగ బ్యాంకులు మొత్తం రూ.6,15,647 కోట్ల రుణాలను రైటాఫ్ చేశాయి’ అని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వక సమాధానంలో పేర్కొన్నారు. 202223 ఆర్థిక సంవత్సరం నుంచి పీఎస్‌బీలకు ఎటువంటి మూలధన సాయం చేయలేదని.. ఆయా బ్యాంకులు తమ ఆర్థిక పనితీరు, మూలధన స్థితిని గణనీయంగా మెరుగుపర్చుకుని లాభదాయకంగా మారాయన్నారు. పీఎస్‌బీలు ఇప్పుడు తమ మూలధన అవసరాలను తీర్చుకోవడానికి మార్కెట్ వనరులు, అంతర్గత సముపార్జనలపై ఆధారపడుతున్నాయని.. అవి 2022 ఏప్రిల్ 1 నుంచి 2025 సెప్టెంబరు 31 వరకు ఈక్విటీ, బాండ్ల ద్వారా మార్కెట్ నుంచి రూ.1.79 లక్షల కోట్ల మూలధనాన్ని సేకరించాయని తెలిపారు.



మీ గుండె పదిలమేనా?


గుండెపోటు బారిన పడుతోన్న వారి సంఖ్య ఇటీవల ఎక్కువవుతోంది. అప్పటి వరకు ఎంతో చలాకిగా ఉన్న వారు కూడా ఒక్కసారిగా కుప్పకూలి పోతున్నారు. మరీ ముఖ్యంగా కరోనా మహమ్మారి తర్వాత గుండెపోటు బారిన పడుతోన్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అయితే గుండె పోటు బారిన పడకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

తెలిసిన వారు ఎవరైనా గుండె పోటుతో మరణిస్తే ఒక్కసారిగా ఆందోళన పెరిగిపోతుంది. మనం ఎంత వరకు భద్రంగా ఉన్నామన్న ప్రశ్న తలెత్తడం ఖాయం. దీంతో చాలా మంది జాగ్రత్త పడడం కంటే ఆందోళన చెందడం ఎక్కువవుతోంది. అనవసరంగా ఒత్తిడి పెంచుకుంటున్నారు. రకరకాల టెస్టులు చేయించుకుంటూ జేబులు గుల్లా చేసుకుంటున్నారు. అయితే ఏ సమయాల్లో పరీక్షలు చేయించుకోవాలి.? ఎలాంటి పరీక్షలు చేయించుకోవాలంటే.

ప్రస్తుతం శారీరక శ్రమ పూర్తిగా తగ్గిపోయింది. ఈ స్థానంలో మానసిక ఒత్తిడి పెరుగుతోంది. 30 నుంచి 40 ఏళ్ల మధ్యలోని వారు బీపీ, షుగర్, ఊబకాయం వంటి సమస్యల బారిన పడుతున్నారు. భారతదేశంలో మరణాలకు గుండెపోటు మొదటి స్థానంలో ఉందంటే నమ్ముతారా.? భారత దేశంలో 50 శాతం గుండెపోటు బాధితుల్లో 50 ఏళ్ల లోపు వారే ఉంటున్నారు. అలాగే వీరిలో 25 శాతం మంది 40 ఏళ్ల కంటే తక్కువ వయసు వారు మాత్రమే కావడం ఆందోళన కలిగిస్తోంది.

వైద్యుల సూచనలు..

శారీరకంగా ఎంతో ఫిట్‌గా ఉన్న వారు కూడా గుండెపోటు బారిన పడుతున్నారు. దీంతో ఇంతకీ మన గుండె పదిలంగానే ఉందా అన్న ప్రశ్న రావడం సహజం. అయితే గుండె పనితీరు ఎలా ఉందో తెలుసుకునేందుకు కొన్ని రకాల పరీక్షలు చేయించుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా 40 ఏళ్లు దాటిన వారు రెగ్యులర్‌గా ఏడాదికి ఒకసారైనా జీవక్రియలకు సంబంధించిన పరీక్షలతో పాటు ఈసీజీ, 2 డి ఎకో, టీఎంటీ వంటి పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. కాగా కుటుంబంలో గుండెపోటు వచ్చిన వారు ఉంటే 35 ఏళ్ల నుంచే ఏడాదికి ఒకసారి పరీక్షలు చేయించుకుంటే మంచిదని అంటున్నారు. అలాగే ‘సీటీ యాంజియోగ్రామ్’ పరీక్ష కూడా చేయించుకోవాలని సూచిస్తున్నారు. దీని రిజల్ట్ నార్మల్‌గా ఉంటే ఐదేళ్ల వరకు మళ్లీ పరీక్ష చేయించుకోవాల్సిన అవసరం ఉండదు. మిగిలిన పరీక్షలను మాత్రం ఏడాదికోసారి చేయించుకోవాలని అంటున్నారు. సాధారణంగా యాంజియోగ్రామ్‌లో రక్తనాళంలోకి కాథటర్‌ను ప్రవేశపెట్టి గుండె రక్తనాళాల్లో పూడికలను పరీక్షిస్తారు. పూడికలు ఉంటే గుండెపోటు వచ్చే అవకాశం ఉంటుందని కాబట్టి ఏమైనా పూడికలు ఉంటే వెంటనే స్టంట్ వేస్తారు. అయితే సిటీ యాంజియో పదేపదే చేసుకోవడం కూడా మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక సిటీ యాంజియో స్కాన్ టీ 20 ఎక్స్‌రేలతో సమానమని అంటున్నారు.



జాగ్రత్తలు తప్పనిసరి..

ఇక గుండెపోటు బారిన పడకుండా ఉండాలంటే తీసుకునే ఆహారంతో పాటు జీవన విధానంలో కూడా కొన్ని మార్పులు చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా నూనె తక్కువగా ఉండే ఫుడ్ తీసుకోవాలని సూచిస్తున్నారు. అదే విధంగా ఒకే చోట ఎక్కువసేపు కూర్చొ కూడదని, వాకింగ్ కచ్చితంగా అలవాటు చేసుకోవాలని అంటున్నారు. ఇక ఫైబర్ కంటెంట్ ఎక్కువగా వుండే ఫుడ్ తీసుకోవాలి. ఇక మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు యోగా, మెడిటేషన్ చేయాలని సూచిస్తున్నారు.







నేడే భారత్, దక్షిణాఫ్రికా టీ 20

భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య టీ 20 పోరుకు వేళయైంది. ఇరు జట్ల ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు మంగళవారం కటక్‌లో తెరలేవనుంది. స్వదేశం వేదికగా ఫిబ్రవరిలో టీ20 ప్రపంచకప్ టోర్నీ జరుగనున్న నేపథ్యంలో ఈ సిరీస్‌ను రెండు జట్లు సన్నాహకంగా భావిస్తున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో సొంత ఇలాఖాలో సత్తాచాటేందుకు టీమ్‌ఇండియా తహతహలాడుతున్నది. మెగాటోర్నీ నాటికి తుది జట్టుపై ఓ స్పష్టమైన అవగాహనకు వచ్చేందుకు సఫారీ సిరీస్‌ను ఉపయోగించుకోవాలని టీమ్ మేనేజ్‌మెంట్ చూస్తున్నది. టెస్టు సిరీస్ వైట్‌వాష్‌ను మరిపిస్తూ వన్డే సిరీస్‌ను ఖాతాలో వేసుకున్న భారత్ అదే జోరులో పొట్టి సిరీస్‌ను దక్కించుకునేందుకు పట్టుదలతో ఉంది. సూర్యకుమార్‌యాదవ్ కెప్టెన్సీలో బరిలోకి దిగనున్న భారత్ అందుకు తగ్గట్లు ప్రణాళికలు రచిస్తున్నది. ముఖ్యంగా గాయాల నుంచి పూర్తిగా తేరుకున్న ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, వైస్ కెప్టెన్ శుభ్‌మన్‌గిల్ రీఎంట్రీ జట్టులో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఆసియాకప్ టోర్నీ తర్వాత జాతీయ జట్టుకు దూరమైన హార్దిక్..ఇటీవలి సయ్యద్ ముస్తాక్‌అలీ టీ20 టోర్నీలో బరోడా తరఫున ఆకట్టుకున్నాడు. అటు బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌లోనూ రాణించాడు. పూర్తి ఫిట్‌నెస్‌తో కనిపిస్తున్న హార్దిక్ చేరికతో జట్టు కాంబినేషన్ మారనుంది. మరోవైపు సఫారీలతో టెస్టు సిరీస్‌లో మెడనొప్పితో జట్టుకు దూరమైన గిల్ రాకతో టాపార్డర్ బలోపేతం కానుంది. హార్డ్ హిట్టింగ్ ఓపెనర్ అభిషేక్‌శర్మ జతగా గిల్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు. తమదైన రోజున ప్రత్యర్థి ఎవరన్నది లెక్కచేయని నైజంతో బ్యాటు ఝులిపించే అభిషేక్‌కు గిల్ తోడైతే పరుగుల వరద పారినట్లే.



భారత్‌కు ఓదార్పు విజయం

ఎఫ్‌ఐహెచ్ మహిళల జూనియర్ వరల్డ్ కప్‌లో ఇప్పటికే క్వార్టర్స్ రేసు నుంచి నిష్క్రమించిన భారత హాకీ జట్టు.. క్లాసిఫికేషన్ మ్యాచ్‌లో గెలిచి టాప్ 10లో నిలిచేందుకు మార్గం సుగమం చేసుకుంది. ఆదివారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో భారత్.. 31తో వేల్స్‌ను ఓడించింది. హినా బానో (14వ నిమిషంలో), సునెలిట (24), ఇషికా (31) తలా ఓ గోల్ చేయగా ప్రత్యర్థి జట్టు నుంచి ఎలొయిస్ (52) ఒక గోల్ కొట్టింది. ఈ టోర్నీలో భారత జట్టు మంగళవారం ఉరుగ్వేతో తమ ఆఖరి మ్యాచ్ ఆడుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే భారత్ టోర్నీని టాప్ 10తో ముగిస్తుంది.



థాయ్‌లాండ్ టోర్నీలో మనోళ్లకు 11 పతకాలు

కోరాట్ వేదికగా జరిగిన థాయ్‌లాండ్ పారా సైక్లింగ్ కప్ 2025లో భారత ప్లేయర్లు సత్తాచాటారు. భారత్ సహా మలేషియా, థాయ్‌లాండ్, యూఏఈ, సౌదీ అరేబియా, ఉజ్బెకిస్థాన్, చైనా, తజకిస్థాన్, ఇండోనేషియా, కొరియా, సింగపూర్ దేశాల నుంచి పారా సైక్లిస్టులు టోర్నీలో పోటీపడ్డారు. ఆదిత్య మెహతా ఫౌండేషన్‌లో శిక్షణ పొందిన పది మందితో కూడిన భారత పారా సైక్లింగ్ బృందం పతకాలతో ఆకట్టుకుంది. కిలోమీటర్ వ్యక్తిగత ట్రయల్స్‌లో విశ్వకు కాంస్యం, లిషా రజతం సాధించారు. వ్యక్తిగత విభాగంలో అదే దూకుడు కొనసాగిస్తూ విశ్వ, లిష కాంస్యాలు కైవసం చేసుకున్నారు. రోడ్ ఈవెంట్ వ్యక్తిగత టైమ్ ట్రయల్స్‌లో విశ్వ, లిషా, యోగేశ్, ప్రశాంత్ కాంస్యాలు సొంతం చేసుకున్నారు. మొత్తంగా టోర్నీలో రెండు రజతాలు సహా తొమ్మిది కాంస్యాలు భారత్ ఖాతాలో చేరాయి. మన పారా సైక్లిస్టులు అసాధారణ ప్రదర్శన కనబరిచారని ఆదిత్య మెహతా అభినందించారు.

వికెట్ కీపర్ ఎవరు?

- సంజూ శాంసన్, జితేశ్ మధ్య పోటీ

వన్డే సిరీస్ పట్టేసిన భారత జట్టు పొట్టి ఫార్మాట్‌లోనూ దక్షిణాఫ్రికాకు చెక్ పెట్టాలనుకుంటోంది. టీ20ల్లో తిరుగులేని విజయాలు సాధిస్తూ.. రికార్డు స్థాయిలో ఆరు సిరీస్‌లు గెలుపొందిన టీమిండియా జోరు చూపాలనే కసితో ఉంది. వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాలు ఆడడం ఖాయమైన వేళ.. తుది జట్టు ఎంపిక ఆసక్తి రేపుతోంది. ముఖ్యంగా సంజూ శాంసన్‌ను తీసుకుంటారా? లేదా? తెలియడం లేదు. వికెట్ కీపర్‌గా సంజూకు, జితేశ్ శర్మ మధ్య పోటీ నెలకొనడమే అందుకు కారణం. టీ20ల్లో వరుసపెట్టి ప్రత్యర్థులను మట్టికరిపిస్తున్న భారత్ ఈసారి స్వదేశంలో దక్షిణాఫ్రికా సవాల్‌కు సిద్ధమైంది. ఆసియా కప్ విజేతగా ఆస్ట్రేలియా పర్యటనలో సిరీస్ గెలుపొందిన టీమిండియా.. అదే కాంబినేషన్‌ను కొనసాగించే అవకాశముంది. శుభ్‌మన్ గిల్ తిరిగి జట్టులో చేరడంతో.. శాంసన్ ఓపెనింగ్ చేసే అవకాశం లేదు. వికెట్ కీపర్, విధ్వంసక ఆటగాడైన సంజూను టాపార్డర్‌లో ఆడిస్తారా? అనేది తెలియాల్సి ఉంది. కోచ్‌గా గౌతం గంభీర్ మొదటి ఛాయిస్ శాంసనే అయినా జితేశ్ శర్మ నుంచి గట్టి పోటీనెలకొంది. ఆసీస్ గడ్డపై, రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో మెరిసిన.. జితేశ్‌కు మరో అవకాశం ఇస్తారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. పవర్ హిట్టింగ్ పరంగా జితేశ్ కంటే మెరుగైన శాంసన్‌కు టీ20ల్లో అనుభవం ఎక్కువ. మరి.. ఈ ఇద్దరిలో కోచ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఎవరిని ఎంచుకుంటారో మంగళవారం టాస్ పడ్డాకే తెలియనుంది. భారత్, దక్షిణాఫ్రికా మధ్య కటక్‌లోని బరామతి స్టేడియంలో తొలి టీ20 జరుగనుంది.



ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu

శుభ్‌మన్ గిల్, పాండ్యా నెట్ ప్రాక్టీస్

- టీ 20లో మెరిసేనా

స్వదేశంలో టెస్టు సిరీస్‌లో ఎదురైన వైట్ వాష్‌కు దక్షిణాఫ్రికాపై వన్డే విక్టరీతో ప్రతీకారం తీర్చుకుంది భారత జట్టు. 21తో వన్డే సిరీస్ కైవసం చేసుకున్న టీమిండియా.. తమకు అచ్చొచ్చిన పొట్టి ఫార్మాట్‌లోనూ సఫారీలను చిత్తు చేయాలనుకుంటోంది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో వరుసగా సిరీస్‌లు గెలుస్తున్న భారత్ .. రేపు బరామతి స్టేడియంలో బోణీ కొట్టాలనే పట్టదలతో ఉంది. మెడ గాయం నుంచి కోలుకున్న వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలి టీ20 కోసం నెట్స్‌లో చెమటోడ్చాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అదరగొట్టిన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా టీమిండియా తరఫున మెరవాలని భావిస్తున్నాడు. అయితే.. అతడు సోమవారం నెట్స్ సెషనల్‌లో పాల్గొనలేదు. కానీ, గిల్ మాత్రం రెండు గంటలు అన్ని రకాల షాట్లు ప్రాక్టీస్ చేశాడు. తిలక్ వర్మ, శివం దూబే, సుందర్.. బౌలింగ్ దళంలోని బుమ్రా, కుల్దీప్, వరుణ్, అర్షదీప్ నెట్స్‌లో గడిపారు. అయితే.. గిల్, పాండ్యా రాకతో తుదిజట్టు ఎంపిక ఆసక్తి రేపుతోంది. వికెట్‌కీపర్‌గా సంజూ శాంసన్ ను తీసుకుంటారా? జితేశ్ శర్మ ఛాన్స్ ఇస్తారా అనేది తెలియాల్సి ఉంది.


భారత తుది జట్టు అంచనా : అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివం దూబే, అక్షర్ పటేల్, సంజూ శాంసన్ / జితేశ్ శర్మ(వికెట్ కీపర్), కుల్దీప్ యాదవ్, బుమ్రా, వరుణ్ చక్రవర్తి.





భయపెట్టే థ్రిల్లర్ 'ఈషా'

లిటిల్ హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి లాంటి సూపర్‌హిట్ కల్ట్ చిత్రాలను ప్రేక్షకులకు అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటి ద్వయం తాజాగా 'ఈషా' పేరుతో ఓ హారర్ థ్రిల్లర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకరాబోతున్నారు. వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ గ్రాండ్‌గా ఈ చిత్రాన్ని డిసెంబరు 12న థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఇటీవల రాజు వెడ్స్ రాంబాయి చిత్రంతో సూపర్‌హిట్ కొట్టిన అఖిల్‌రాజ్ తో పాటు త్రిగుణ్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రంలో హెబ్బాపటేల్ కథానాయిక. సిరి హనుమంతు, బబ్లూ, పృథ్వీరాజ్ ఇతర ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని హెచ్‌వీఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీనివాస్ మన్నె దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం నుంచి ఇటీవల విడుదలైన గ్లింప్స్‌కు అనూహ్య స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్‌ను గమనిస్తే.. ఇప్పటి వరకు వచ్చిన రెగ్యులర్ హారర్ థ్రిల్లర్ జానర్‌లో ఇదొక ఆసక్తికరమైన పాయింట్‌తో అల్లుకున్న భయపెట్టే కథ అనిపిస్తుంది. రెగ్యులర్ హారర్ ఫార్ములాకు భిన్నంగా ఉండేలా కనిపిస్తుంది. మీరు ఊహించని చీకటి ప్రపంచం మరొకటి ఉంది అని ట్రైలర్ మొదలు ఆసక్తికరంగా మొదలవుతుంది. ఈ ట్రైలర్‌ను చూస్తుంటే ప్రేక్షకలు ఉలిక్కిపడే ట్విస్టులు పుష్కలంగా ఉన్నాయనిపిస్తుంది. దెయ్యాలు, ఆత్మలు లేవని బలంగా నమ్మే స్నేహితుల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. సమాజంలో ఉన్న మూఢ నమ్మకాలను, దొంగ బాబాలను ఎక్స్ పోజ్ చేయడానికి బయలుదేరిన వీరికి, బాబ్లూ పృథ్వీరాజ్ రూపంలో ఒక సవాలు ఎదురవుతుంది. "ఆత్మలు ఉన్నాయని నిరూపిస్తే.." అంటూ ఆయన విసిరే ఛాలెంజ్ తో వీరు ఒక చీకటి ప్రపంచంలోకి అడుగుపెడతారు. సైన్స్ కు, అతీంద్రియ శక్తులకు మధ్య జరిగే క్లాష్ దీన్ని ఆసక్తికరంగా మలిచారు. ట్రైలర్‌లోని విజువల్స్ చాలా వరకు బ్లూ అండ్ డార్క్ థీమ్‌లో సాగాయి. ముఖ్యంగా ఆ పాడుబడిన బంగ్లా, అక్కడ నేల మీద వేసి ఉన్న యంత్రాలు, క్షుద్ర పూజల సెటప్ సినిమాలోని మూడ్ ని ఎలివేట్ చేశాయి. కెమెరామెన్ సంతోష్ లైటింగ్ వాడిన విధానం, దానికి ఆర్ఆర్ ధృవన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ తోడై కొన్ని చోట్ల ఉలిక్కిపడేలా చేశాయి. సౌండ్ డిజైన్ హార్రర్ సినిమాలకు ఎంత ముఖ్యమో ఈ సినిమా సౌండ్ డిజైనింగ్ ఎగ్జాంపుల్‌గా నిలుస్తుందేమో అనిపిస్తుంది. డిసెంబర్ 12న ఈ సినిమా థియేటర్లలోకి రానుంది. ట్రైలర్ చివర్లో వచ్చే ట్విస్ట్ లు, ఫాస్ట్ కట్స్ సినిమా మీద ఒక క్యూరియాసిటీని అయితే క్రియేట్ చేశాయి. హార్రర్ థ్రిల్లర్ ను చూడాలనుకునే ప్రేక్షకులకు అంతకు మించి సమ్‌థింగ్‌ను ఈ సినిమా అందించబోతున్నాయని ట్రైలర్ చూసిన అందరూ అంటున్నారు.



'అవతార్: ఫైర్ అండ్ యాష్' ఒక ఎమోషనల్ జర్నీ!

'అవతార్: ఫైర్ అండ్ యాష్' కోసం దేశవ్యాప్తంగా అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అయితే ఈ ఫ్రాంచైజీకి భారతీయులు ఇంతలా కనెక్ట్ అవ్వడానికి కారణం.. కేవలం అందులోని విజువల్స్, టెక్నాలజీ లేదా ఐమాక్స్ (IMAX) స్కేల్ మాత్రమే కాదు; ఆ కథలో అంతర్లీనంగా ఉన్న పక్కా భారతీయ భావోద్వేగాలే అసలు కారణం. 'అవతార్' సిరీస్‌లో హీరో జేక్ సల్లి పాత్ర అచ్చం మన భారతీయ కుటుంబ పెద్దల తరహాలోనే ఉంటుంది. కుటుంబానికి అండగా నిలబడటం, పిల్లల రక్షణే పరమావధిగా బతకడం, నైతిక విలువలు, త్యాగనిరతి... ఇవన్నీ ఆయన పాత్రలో స్పష్టంగా కనిపిస్తాయి. ఇక నేటిరి విషయానికి వస్తే ఆమె ఒక తల్లిగా, యోధురాలిగా ఇంటికి దొరికిన బలం. కుటుంబం కోసం దేన్నైనా ఎదిరించే ఆమె పాత్ర, మన సంస్కృతిలోని శక్తివంతమైన స్త్రీ మూర్తికి నిలువుటద్దంలా అనిపిస్తుంది. సల్లి కుటుంబంలోని అన్నదమ్ముల (నెటేయమ్-లో'ఆక్) అనుబంధం కూడా మన 'దేశీ' కథలను గుర్తుచేస్తుంది. బాధ్యత, భావోద్వేగాల మధ్య నలిగిపోయే అన్నదమ్ములు, తల్లిదండ్రుల నీడలో పెరిగే పిల్లలు... ఈ ట్రాక్ అంతా మన ఇక్కడి ఫ్యామిలీ డ్రామాలను తలపిస్తుంది. పాండోరా గ్రహం కోసం నావీ జాతి మొత్తం ఏకం కావడం మన కథల్లోని 'మన మట్టి, మన మనుషులు' అనే భావనకు భారీ రూపంలా అనిపిస్తుంది. ఇక పాండోరాను నడిపే ఆధ్యాత్మిక శక్తి 'ఐవా', మనం ప్రకృతిని దైవంగా ఆరాధించే విధానానికి ఎంతో దగ్గరగా ఉంటుంది. జేమ్స్ కామెరూన్ సినిమాలు ఎప్పుడూ యాక్షన్‌తో పాటు హృదయాన్ని తాకే భావోద్వేగాలను మిళితం చేస్తాయి. బ్రదర్‌హుడ్, త్యాగం, స్నేహం, కుటుంబ బంధాలు... ఇవే అవతార్ కథలకు అసలైన బలం. అందుకే ఈ ఫ్రాంచైజ్‌లో మనకు తెలియకుండానే ఒక 'ఇండియన్ కనెక్షన్' కనిపిస్తూనే ఉంటుంది. ఈ చిత్రం హిందీ, తమిళ్, తెలుగు, కన్నడ, మలయాళం భాషలలో డిసెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది.




'ఓం శాంతి శాంతి శాంతిః' టీజర్ లాంచ్

ట్యాలెంటెడ్ ఫిల్మ్ మేకర్స్ తరుణ్ భాస్కర్ తన అద్భుతమైన నటనతో కూడా తెరపై అలరిస్తున్నారు. 'ఓం శాంతి శాంతి శాంతిః అనే కొత్త ప్రాజెక్ట్‌లో మరోసారి లీడ్‌లో చేస్తున్నారు. ఈషా రెబ్బా హీరోయిన్ గా నటిస్తున్నారు. A R సజీవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రం, సహజమైన హాస్యం, ఆకట్టుకునే డ్రామాతో కూడిన వినోదభరితమైన విలేజ్ కామెడీ. ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ సంయుక్తంగా మద్దతునిస్తున్నాయి, సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్ ,నవీన్ సనివరపు ఈ వెంచర్‌ను నిర్మిస్తున్నారు, కిషోర్ జాలాది, బాల సౌమిత్రి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. మొత్తం షూటింగ్ పూర్తయి, పోస్ట్‌ప్రొడక్షన్ పనులు పూర్తి కావస్తున్న నేపథ్యంలో, చిత్ర బృందం సినిమా టీజర్‌ను లాంచ్ చేయడం ద్వారా ప్రమోషన్లపై మొదలుపెట్టింది.

భర్త మహాశయులకు విజ్ఞప్తి

రేపు రెండో పాట రిలీజ్

మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్న అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో అలరించబోతున్నారు . SLVసినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని హై ప్రొడక్షన్ వాల్యూస్ తో నిర్మిస్తున్నారు. జీ స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఇందులో రవితేజ సరసన ఆషికా రంగనాథ్ , డింపుల్ హయతి కథానాయికలుగా నటిస్తున్నారు. బ్లాక్ బస్టర్ ఫస్ట్ సింగిల్ బెల్లాబెల్లాతో మ్యూజిక్ ప్రమోషన్‌లను స్టార్ చేసిన మేకర్స్ ఇప్పుడు సెకండ్ సింగిల్ అప్డేట్ ఇచారు. సెకండ్ సింగిల్ అద్దం ముందు డిసెంబర్ 10న రిలీజ్ కానుంది. రవితేజ, డింపుల్ హయతిపై చిత్రీకరించిన ఈ సాంగ్ అదిరిపోయే మెలోడీ డ్యూయెట్. మేకర్స్ రిలీజ్ చేసిన ప్రోమోలో రవితేజ, డింపుల్ హయతి కెమిస్ట్రీ చూడముచ్చటగా వుంది. ఫుల్ సాంగ్ పై అంచనాలు పెంచింది.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200